Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 82 • సంచిక: 48 • 23-11-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

Hotel D.S.R Paradise



- 50 varieties of Tandoori
- All varieties of Indian & Chinese dishes
- Ample car parking

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

జైపాల్‌రెడ్డి రాజీనామా?



కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి రేపు జనవరిలో తన పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నా రని విశ్వసనీయ సమా చారం. మొన్నటి మంత్రి వర్గ విస్తరణలో తన నుంచి కీలకమైన పెట్రో లియం శాఖను తప్పించడం ఆయన మనసును బాధపెట్టింది. ఈ మార్పుకు కారణం జనంలో ప్రచారం జరిగినట్లు రిలయన్స్ కంపెనీ ఒత్తిడి కాదని కేవలం రాహుల్ గాంధీకి తనపై అయి ష్టత ఏర్పడడం వల్లనే ఆ అవమానం జరిగిందని భావిస్తున్నారట ఆయన. పార్టీ అధిష్టానానికి తనపై సముఖత లేనప్పుడు పదవిలో కొనసా గడం సమంజసం కాదని భావిస్తున్నాడు. అయితే రాజీనామా తర్వాతే వేరే పార్టీలో చేరడం కానీ, మళ్లీ ఎన్నికలలో పోటీ చేయడం కానీ జరగదని ఖండితంగా చెప్తున్నాడు జైపాల్ రెడ్డి. రేపటి ఎన్నికల కోసం తెలంగాణ ఫ్రంట్ పెడదామని తన వద్ద ప్రతిపాదించిన కోమటిరెడ్డి సోదరులతో ఆ విషయాన్ని కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పి, వెనక్కు పంపాడాయన. 45ఏళ్ల పాటు ఎన్నికల రాజకీయాలు చేసిన తాను ఇప్పుడు కొత్తగా మరో ఫ్రంట్‌కు లేదా పార్టీకి సారధ్యం వహించే పరిస్థితి లేదని, ఈ జీవితా నికి ఇది చాలనుకొని రిటైర్ అయిపోతానని చెప్పారట ఆయన.

• అవిశ్వాసం పెడితే...

అంతే సంగతులు!


రాష్ట్ర రాజకీయాలలో ఇప్పుడు నలుగు తున్న సమస్యలు రెండే రెండు. మొద టిది వలసల వివాదం. రెండవది అవిశ్వాస తీర్మా నంపై ఒత్తిడి. వైఎస్.జగన్, కెసిఆర్‌లు రాజకీయ వాదులందరికీ అయస్కాంతాల వలె కన్పిస్తున్నారు. కాంగ్రెస్, టిడిపిలు రేపటి ఎన్నికలలో బ్యాలెట్ బాక్సుల ముందు బోల్తా పడక తప్పదని అర్థమై పోవడంతో ఆ రెండు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్పీలు జాగ్రత్త పడుతున్నారు. తెలంగాణ సెంటి మెంట్ ఉధృతంగా వున్న చోట టిఆర్ఎస్‌కు, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో జగన్ పార్టీకి వలస పోవడం తప్ప వేరే మార్గాంతరం లేదన్న భావన అందరిలో బలపడి పోతున్నది.

కాంగ్రెస్‌కు చెందిన తెలంగాణ నేతలందరూ దాదాపుగా ఏదో ఒక పార్టీలో చేరి పోవాలనే ప్రయ త్నంలో వున్నారన్నది నిజం. దశాబ్దాల తరబడి కాం గ్రెస్ కుటుంబంగా కొనసాగిన వారు కూడా ఆ పార్టీలో వుండడం అంటే నిప్పుల కుంపటిపై నిలబ డడం అన్నట్లు భావిస్తున్నారు. జలగం వెంగళరావు కుమారుడు జలగం వెంకటరావు జగన్ పార్టీలో చేరి పోవడం ఇందుకొక ఉదాహరణ. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనుమడు సైతం అదే దారిలో వున్నాడు. జి.వెంకటస్వామి కుమారుడు, ఎమ్పీ వివేక్ కెసిఆర్‌తో ఒప్పందం కుదుర్చుకొన్నాడన్నది బహిరంగ రహస్యం. ఈ మూడూ కూడా కాంగ్రెస్ కుటుం బాలు. నలభై, యాభై ఏళ్లకు పైబడి కాంగ్రెస్‌తో మమేకమైనవి.

తెలంగాణలో కూడా వైఎస్.జగన్ బలపడి పోవడం కెసిఆర్‌కు ఎంత మాత్రం ఇష్టం లేదు. అది తన ఉనికికే ప్రమాదమని ఆయన భయం. అందు వల్లనే ఉద్యమాన్ని పక్కనపెట్టి వలసల మీద దృష్టి పెడుతున్నాడు. జలగం వెంకటరావు, కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డిల ఉదంతం ఆయనలో తొందర పెంచింది. ఇప్పటివరకు ఐదుగురు ఎమ్పీలు ఆయన వలసల ఆకర్షణలో చిక్కుకొన్నారని వినికిడి. జి.వివేక్, మందా జగన్నాధం, మధు యాష్కీ గుత్తా సుఖేంద్రరెడ్డి, రాజయ్య కెసిఆర్‌తో ఒప్పందానికి వచ్చేశారు. మరికొంతమంది క్యూలో వున్నారు.

జగన్ విషయంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందడుగు వేశాడు. అయితే అది ఆశించి నంత ప్రోత్సాహం ఇవ్వలేదు. తెలంగాణలో జగన్‌ను నమ్ముకోవడం ఎంతవరకు సమంజసం అన్న అను మానం నేతలలో వుండడమే అందుకు కారణం. దానితో జగన్ పార్టీలో కలిసి పోవడంగా కాకుండా కాంగ్రెస్ నుంచి విడిపోయి, తెలంగాణ ఫ్రంట్ పేరుతో ఎన్నికలలో పోటీ చేసి, ఆ తర్వాత జగన్‌తో కల వడం సమంజసమన్న ఆలోచన చేస్తున్నారు కోమటి రెడ్డి సోదరులు. ఈ ప్రయత్నంలో జైపాల్‌రెడ్డి సహా

కొరవ 14వ పేజీలో





కసబ్ కథ ముగిసింది

ఎట్టకేలకు, చిట్టచివరకు కసబ్‌ను ఉరి తీశారు. 21తేది ఉదయం పూనాలోని ప్రఖ్యాత ఎరవాడ జైలులో అత్యంత రహస్యంగా ఉరి తీయడమే కాదు, ఆ శవాన్నీ ఆ జైలు ఆవరణంలోనే పూడ్చి పెట్టేశారు. 2008 నవంబర్ 26తేది రాత్రి బొంబాయి వీధులలో నరమేధం సృష్టించిన కిరాతకుడు – కసబ్. ఆనాటి దృశ్యాలు ఇప్పటికీ కోట్లాది మంది భారతీయుల కళ్ల ముందు కదలాడుతూనే వున్నాయి. పాకిస్తాన్ నుంచి వచ్చిన తీవ్రవాద ముష్కరుల ముఠాలో కసబ్ కీలకవ్యక్తి కావడమే కాదు, కసాయితనానికి ఒక సంకేతం వంటి వాడు కూడా. దాదాపు 164 మంది ప్రాణాలు తీయడం తోపాటు 350 మందిని చావుకు సమీపం వరకు తీసుకవెళ్లిన ఈ ఘోర దుర్ఘటనలో కసబ్ వ్యవహరించిన తీరు వింటే ఒళ్లు జలదరిస్తుంది. కసబ్ బృందం మొదటగా ఛత్రపతి శివాజీ రైల్వే స్టేషన్‌పై దాడి చేసింది. అక్కడ అమాయకంగా నిద్రపోతున్న వారిని పిట్టలను కాల్చినట్లు కాల్చి చంపింది. అక్కడ నుంచి వీరు కామా హాస్పిటల్ వెళ్లారు. తమకెదురు వచ్చిన పోలీసు జీపుపై బుల్లెట్ల వర్షం కురిపించి, ప్రసిద్ధ పోలీసు అధికారి హేమంత్ ఖర్కరే సహా ఆరుగురిని హతం చేశారు. ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను తమతో బందీలుగా పట్టుకొని వెళ్తూ తమ కాల్పులకు అమాయక ప్రజలు ఎట్లా చావు కేకలు పెట్టిందీ చెప్పుకొని నవ్వుకొన్నారు. పోలీసుల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల గురించి జోక్‌లు విసురుకొన్నారు. మధ్యలో ఒక కానిస్టేబుల్ మీద సరదాకి తుపాకి పేల్చి, అతడి చావు కేకలను సంగీత ధ్వనుల వలె విని ఆనందించారు. మధ్య మధ్యలో సరదాగా దారిన కన్పించిన వారి మీద తుపాకి పేల్చి, వారు నేలకొరగడాన్ని ఒక వినోదంగా చూశారు. కొన్ని గంటలపాటు బొంబాయి ప్రజలకు నరకం చూపించిన ఈ మృత్యు పిశాచిలో, అరెస్టు అయ్యి, విచారణ జరిగే ఏ దశలో కూడా తన దానవత్వానికి పశ్చాత్తాప మనేదే కన్పించలేదు.

మరొక దేశంలో అయితే అతడు చేజిక్కిన పక్క క్షణంలోనే ముక్కలు ముక్కలుగా నరికి చంపి వుండేవారు. తమ దేశంలో కల్లోలం సృష్టించిన ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికన్ ప్రభుత్వం వెంటాడి వేటాడి, చేజిక్కించుకొని, చంపి, శవాన్ని సముద్రంలో పారవేసింది. కానీ మన ప్రభుత్వం మాత్రం కసబ్ భద్రత కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, పదిలంగా చూసుకొన్నది. కసబ్‌ను ఖైదు చేసిన జైలు గదిని 8 కోట్ల ఖర్చుతో నిర్మించారు. ఒక లారీ నిండా బాంబులు నింపి ఢీ కొట్టినా గోడలు దెబ్బతినని స్థాయిలో కట్టారు దాన్ని. కసబ్ ఆరోగ్యం కోసం జెజె ఆస్పత్రిలో 5 కోట్ల ఖర్చుతో ఒక వార్డు నిర్మించారు. అతడికి జైలులో సుగంధ ద్రవ్యాలు కూడా సరఫరా చేశారు. కోరిన ఆహారం వండి వడ్డించారు. కసబ్ రక్షణ చూసిన ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు దళం ఖర్చు ఒక్కటే 20 కోట్లకు పైమాటే అట. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదిగా కసబ్‌ను ప్రపంచానికి చూపించడానికి అంత కష్టపడింది భారత ప్రభుత్వం.

మతం పేరుతో మనుషుల ప్రాణాలతో చెలగాట మాడే కర్కసుల పట్ల ఇంత ఉపేక్ష ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. గుజరాత్ ఎన్నికలలో నరేంద్ర మోడి దీన్నొక వివాదంగా మార్చడంతో ఇప్పుడైనా ఈ నిర్ణయం తీసుకొన్నారు కానీ, లేకుంటే ఇంకెంతకాలం కసబ్‌ను ఇంటి అల్లుడి వలె ఆదరించివుండే వారో చెప్పలేము. మరణ దండన మానవత్వంగా కన్పించదన్న వాదన కసబ్ వంటి దానవత్వం మూర్తీభవించిన వారికి వర్తింపచేయవలసిన అవసరం లేదు. అటువంటి వారి పట్ల ఉదాసీనత, క్షమా ధోరణి బలహీనతగా మిగిలిపోతుందే తప్ప దయా హృదయం అన్పించుకోదు. దేశ సమగ్రత, భద్రతలకు ముప్పు తెచ్చి, కోట్లాది ప్రజానీకంలో భయోత్పాతాన్ని సృష్టించే వారి పట్ల కరుణ చూపవలసిన అవసరం అసలే లేదు. ఇటువంటి తీవ్రవాదుల కథకు ఇటువంటి ముగింపే సముచితం. పార్లమెంట్ మీద దాడి చేసిన అఫ్జల్ గురును కూడా ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఉరి తీసి, మనది బలహీన సమాజం కాదని ప్రపంచానికి రుజువు చేసుకోవాల్సిన అవసరం వుంది. తీవ్రవాదానికి పాల్పడే ప్రతి కిరాతకుడికీ ఇదే సరైన శిక్ష.

జమ్మిచైత్రు

జనవాక్కు

ప్రభుత్వానిదే తప్పు!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం. డ్వాక్రా మహిళలంటూ, పేదలంటూ సబ్సిడీలు ప్రకటించి ఇంటింటికి గ్యాసు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేసి, వంట చెరకు వాడకం మాన్పించి సిలిండర్ గ్యాస్ వాడకం పెంచారు. నేడు గ్యాస్ వాడకం లేని ఇల్లు లేదు. నగరంలో ప్రతి గదికి కనెక్షన్లు వున్నాయి. ప్రజలందరినీ గ్యాస్ వినియోగదారులుగా మార్చిన ప్రభుత్వాలు తర్వాత గ్యాస్ ధరలు పెంచుతూ ఇక్కట్లకు గురి చేస్తున్నా తట్టుకొని కాలం వెళ్లదీస్తుంటే ప్రస్తుతం సంవత్సరానికి ఆరు సిలిండర్లకే సబ్సిడీ అంటూ చెప్పడమేమిటి? ఉమ్మడి కుటుంబాలలో నెలకో సిలిండర్ సరిపోదు. ఇక నుంచి ప్రభుత్వం ఉచితం మాటను ఎత్తకుండా వుండాలి. ప్రజలను కష్టాలపాలు కాకుండా కాపాడాలి.

పి.అరుణకుమారి — నెల్లూరు

రాష్ట్రపతికి అభినందనలు!

భారతీయులు ఇక నుంచి తనను హిజ్ ఎక్సలెన్సీ అని సంబోధించక్కర లేదని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్వయంగా చెప్పడం ఆహ్వానించతగ్గ పరిణామం. తెల్లదొరలు మనదేశాన్ని విడిచివెళ్లినా మన నల్లదొరలకు భావదాస్యం మాత్రం వదలలేదు. అందుకే 65ఏళ్లుగా హిజ్ ఎక్సలెన్సీ పదాన్ని వాడుతున్నాం. అలాగే కోర్టు భాష నుంచి మిలార్డ్, యువర్ లార్డ్‌షిప్ లాంటి పదాలకు బదలు మిస్టర్ జస్టిస్ అని ఉపయోగించడమేగాక బ్రిటీష్ కాలం నాటి రాజద్రోహ నేరం, కోర్టు ధిక్కరణకు సంబంధించిన చట్టాలు మార్చాలి.

ఎస్వీ రమణయ్య — నెల్లూరు

ప్రత్యేక రైళ్లను పెంచండి!

దసరా పండుగను పురస్కరించుకొని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను అందులో ఎసి రైళ్లను ప్రవేశపెట్టడం ముదావహం. అదేవిధంగా అన్ని పర్వ దినాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రైళ్లను తగిన సంఖ్యలో పెంచి నడపాలి. పండుగల రోజుల్లో దక్షిణ మధ్య రైల్వే ఆధీనంలోని సికింద్రాబాదు నుండి తిరుపతికి రద్దీని బట్టి రైళ్లను నడపాలి. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్న ప్రత్యేక రైళ్లు సరిపోవడం లేదు. ఎస్‌టి, ఎస్‌సి, బిసిలను కూడా దృష్టిలో పెట్టుకొని వారి ఆదాయానికి తగిన ప్రత్యేక రైళ్లను నడప మనవి.

దోగిపర్తి సత్యనారాయణ — అల్లూరు

కుక్కల్ని పట్టండి – పందుల్ని కాల్చండి!

పందులు, కుక్కలు, కోతుల నిర్మూలనపై నెల్లూరులో కొందరు వ్యక్తులు కోర్టు నుండి 'స్టే' తెచ్చారని తెల్సి ఆశ్చర్యపోవాల్సి వస్తోంది. ముఖ్యంగా పట్ట

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

27-11-1942
పేజీలు : 6 వెల: అణా

ఎ.సి.పార్కు

ఎన్నెన్నో తంటాలు పడి ఎ.సి.సుబ్బారెడ్డిగారు పార్కును ఖాయం చేయించుకున్నారు.

యిదివారి ఆత్మ ప్రీతికరం – రేడియో శ్రోతలకు ఆనందకరం.

కాని యిప్పుడు ఈ ఆరామం తగిన సంస్కారం లేక, మొదటి గలీజు స్థితికి వస్తున్నందుకు మాత్రం విచారపడవలసి వున్నది.

చెట్లకు ప్రాపు లేదు. పోసిన పాత యిసక దుమ్ము అయిపోయింది. పారవేసిన బీడి ముక్కలు పర్వతోమానాలై కూర్చోనే సహించకుండా వున్నది. ఈ దుస్థితికి కారణం కమిషనరుగారి అశ్రద్ధ అనాలగదా!

ఇది ఎవరి అజమాయిషీలో వున్నది?

దీనిని మంచిస్థితిలో వుంచుటకు యికనైనా కమిషనరుగారు శ్రద్ధ తీసుకొంటారా!

పరాయి గ్రామాలవారు వచ్చి ఈ తోటను చూస్తే నెల్లూరు ఆరోగ్య ఆదర్శాన్ని ఎంతగా ఏవగించుకొంటారో! లేకలేక ఒక లోకాయ బుడితే – లోకాయ కన్ను లొట్టబోయింది అనిపించకండి.

అసలు కమిషనరు అంత సమర్థుడుగా కనిపించడం లేదులెండి.

–రంధ్రాన్వేషి

50 ఏళ్ల క్రితం ఈవారం

23-11-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

పెకింగ్ భక్తుల పట్టివేత

దేశవ్యాప్తంగా బుధవారం రోజు 350 కమ్యూనిస్టు నాయకులు అరెస్టు గావింపబడినారు.

ఈ అరెస్టులలో; ప్రజా రక్షణ సంఘంలో కమ్యూనిస్టులకు స్థానమిచ్చి, వారి దేశభక్తిని శంకించవద్దని చెప్పిన కామరాజు గారి మద్రాసు అగ్రస్థానం; బొంబాయిలాగా అరెస్టులకు, మద్రాసులాగా కమ్యూనిస్టులకు సభ్యత్వాలిచ్చుటకు పూనుకోనున్న నీలం సంజీవరెడ్డిగారి ఆంధ్రప్రదేశ్ ఆఖరుస్థానము వహించాయి.

మద్రాసులో వందమంది, ఆంధ్రలో 22 మంది అరెస్టుగావింపబడినారు. ఆంధ్రలో అరెస్టు గావింపబడిన వారిలో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, మోటూరు హనుమంతరావు, కాట్రగడ్డ రాజగోపాల రావు, నండూరు ప్రసాద రావు, ఉద్దరాజు రామం, బద్దం ఎల్లారెడ్డి, కంభంపాటి సత్యనారాయణ, దేవులపల్లి వెంకటేశ్వర రావు ముఖ్యులు. అరెస్టయిన వారిలో ఆర్గురు శాసనసభ్యులు.

అరెస్టయిన ఇతర అగ్రనాయకులు నంబూద్రిపాద్, జ్యోతిబాసు, ముజఫర్ అహమ్మద్ (మద్రాసు) కేరళ మాజీ మంత్రులు అచ్యుత మీనన్, శ్రీమతి గౌరి, ప్రమోద్‌దాస్ గుప్త (బెంగాల్), బాబా గురుముఖ్ సింగ్ (పంజాబు) వగైరాలు.

నమ్మి మోసపోవడం కంటే ముందు జాగ్రత్తే మంచిది.

నెల్లూరు ముచ్చట్లు

వివేకా మారాడా? లేదా??

ఈ సందేహం కలెక్టర్ బంగళాలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో జిల్లా అధికారులకు కల్గింది. సహజంగా వివేకానే రొట్టెల పండుగ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తాడు. వీటికి జిల్లా అధికారులు వెళ్తుంటారు. ఎందువల్లో కలెక్టర్ ఈ సమావేశం ఏర్పాటు చేస్తే... అదీ తన బంగళాలో దానికి వివేకానందరెడ్డి హాజరయ్యాడు. కలెక్టర్, ఎస్పీ ఈ సమావేశంలో సూచించినట్లు ఏర్పాట్లు చేయమని తలూపాడట. ఒక్కమాట కూడా ఆయన అదనంగా మాట్లాడక పోవడం చూసి కలెక్టర్, ఎస్పీ మొదలు అందరు అధికారులు ఆశ్చర్యపోయారు. వివేకాలో నిజంగానే ఈ మార్పు వచ్చిందా? దీని వెనుక ఏదైనా మతలబు ఉందా అనే విషయమై అధికారవర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుంది.

ఆయన తొందరపడ్డారు!

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ఈ మధ్య మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ హైదరాబాద్‌లో ప్రత్యేక చికిత్స పొందుతున్న సమయంలో ఎస్పీ బంగళాకు ఆయన జంట ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి ఒక్కడే వెళ్లారట. వివేకానందరెడ్డి పోలీసులను విమర్శించడంలో తొందరపడ్డారని, ఈ విషయంలో తనకేమీ సంబంధం లేదని ఎస్పీ రమణకుమార్‌కు చెప్పి వచ్చారట. శ్రీధర్‌కృష్ణారెడ్డి ఓదార్పు ఎస్పీకి జీవన్‌టోన్ టానిక్‌లా పనిచేసిందని పోలీసు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

విమార్ట్ వద్ద మామూళ్లు తీసుకొన్నదెవరు!

నెల్లూరు మాగుంట లేఅవుట్ విమార్ట్ షాపింగ్ మాల్‌ను కొత్తగా పెట్టారు. దీన్ని18వ తేది రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ప్రారంభించాలి. ఈ బిల్డింగ్‌కు అనుమతులు లేవని 17వ తేది సాయంత్రం కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. మళ్లీ దీని నిర్వాహకులు నగరంలోని రాజకీయ ముఖ్యులను కలసి మామూళ్లు ఇవ్వడంతో అంతా సవ్యమని ప్రారంభోత్సవానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నగరంలో ఎక్కడ ఏ చిన్న కట్టడం నిర్మాణం మొదలైనా ఆ ప్రాంతంలోని బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్, చెయిన్ మెన్, అటెండర్‌కు తెలిసి పోతుంది. అక్రమ నిర్మాణం జరుపుతుంటే వీరు దాన్ని అడ్డుకోవాలి. నిర్మాణం మొత్తం పూర్తయ్యాక అడ్డుపడ్డారంటే దాని వెనుక మతలబు ఏమిటో జనానికి వివరించనక్కర లేదు. విమార్ట్ సీజ్ – మళ్లీ దాన్ని తొలగింపజేయడంలో మునిసిపల్ కార్పొరేషన్ ప్రతిష్టపై మాయని మచ్చలు పడ్డాయనడం నిజం.

అసద్ వెనుక గౌతమ్?

కాంగ్రెస్ పార్టీతో మజ్లిస్ కటీఫ్ వెనుక సవాలక్ష కారణాలున్నా ఆయన్ను వైకాపా వైపు ఆకర్షించడంలో ముఖ్య పాత్ర పోషించింది మేకపాటి గౌతమ్‌రెడ్డి అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. గౌతమ్‌రెడ్డి నెల్లూరు ఎమ్పీ రాజమోహన్‌రెడ్డి కుమారుడు. వైకాపా నేత జగన్మోహన్‌రెడ్డికి చాలా ముఖ్యుడు. గౌతమ్‌రెడ్డి, మజ్లిస్ నేత అసదుద్దీన్ ఓవైసీ క్లాస్‌మేట్స్. వీరిద్దరూ కలసి ఒకటికి రెండు మూడు సార్లు జగన్‌ను జైలులో కలిశారు. ఈ భేటీ తర్వాత నిరంతరం గౌతమ్ అసద్‌కు టచ్‌లోనే ఉండి కాంగ్రెస్‌కు కుంటిసాకులతో కటీఫ్ చెప్పేలా చేశారంటున్నారు. గౌతమ్ ఇటీవల రాజకీయల్లోకి వచ్చారని అందరూ చెబుతుంటారు. వయస్సు తక్కువైనా ఆయన మహాముదురు రాజకీయవేత్త అని వైకాపా మజ్లిస్ కొత్తబంధంతో లోకానికి తెలిసింది.

జాయింట్ కలెక్టర్‌గా లక్ష్మీకాంతం

నెల్లూరులో అడిషనల్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న లక్ష్మీకాంతంకు ప్రభుత్వం ఐఏఎస్ హోదా ఇవ్వడంతో పాటు ఇక్కడే జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. లక్ష్మీకాంతం కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా పనిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకులను సైతం ఆయన మెప్పించబట్టే జాయింట్ కలెక్టర్‌గా నియమింపబడ్డారన్నది వాస్తవం. లక్ష్మీకాంతం లౌక్యం తెలిసిన అధికారి కాబట్టి నెల్లూరులో రాణిస్తారని భావిస్తున్నాం.

వెంకటగిరి వైకాపా అభ్యర్థి కొమ్మి!

వెంకటగిరి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా కొమ్మి లక్ష్మయ్య నాయుడిని వైఎస్ జగన్ జైలు నుంచి ప్రకటించాడన్న వార్త 17వ తేది సాయంత్రం నుంచి నెల్లూరులో దావానంలా వ్యాపించింది. అందరూ కొమ్మికి ఫోన్లుచేసి అభినందించారు. నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ అంటే వైకాపాలో రేపటి ఎన్నికల్లో పోటీదారుడని అర్థమట.

నెల్లూరు ఎమ్మార్వోకు పదోన్నతి!

నెల్లూరు ఎమ్మార్వోగా పనిచేస్తున్న భక్తవత్సలరెడ్డికి డిప్యూటీ కలెక్టర్‌గా సిసి

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Onlineలో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజి బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించి వలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పొగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

ఎల్‌ఆర్ పదోన్నతుల కమిటీ ప్రమోషన్ ఇచ్చింది. పోస్టింగ్ మాత్రం ఇంకా ఇవ్వలేదు. అధికార పక్షం చెప్పినట్లు వినే ఎమ్మార్వోగా భక్తవత్సలరెడ్డికి పేరున్నా వారికి తెలియకుండా ప్రతిపక్షాలకు పనిచేసే అధికారిగా ఆయన అన్నివర్గాల మన్ననలు సైతం పొందారు.

కోడిగుడ్లు అమ్మేస్తున్నారు!

నెల్లూరు నగర పరిధిలో 218 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలకు వచ్చే వారికి ఉడకబెట్టిన కోడిగుడ్లు ఇస్తారు. మంగళ, శుక్రవారాల్లో ఈ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే



నెల్లూరు పొగతోటలోని ప్రభవ చిన్నపిల్లల బడిలో బాలల దినోత్సవపు వేడుకల్లో పిల్లలతో నిర్వాహకురాలు చంద్రలత.

కార్యకర్తలు క్రేట్లు, క్రేట్లుగా అమ్మేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర నాలుగు రూపాయలుగా పలుకుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు కోడిగుడ్డును ఇళ్ల దగ్గరకు తెచ్చి 2–50 పైసలకు ఇచ్చేస్తున్నారు. ఈ వ్యవహారంపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారులు దర్యాప్తు చేయించాల్సి ఉంది.

నెల్లూరు డిఎస్పీగా వెంకటనాథ్‌రెడ్డి!

నెల్లూరు నగర డిఎస్పీగా వెంకట నాథ్‌రెడ్డి 18వ తేది బాధ్యతలు తీసుకున్నారు. ఈయన కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్పీగా పనిచేస్తూ ఇక్కడకు బదలీ అయ్యారు. వెంకటనాథ్‌రెడ్డిని ఆనం బ్రదర్స్‌కు తెలియకుండా నియమించారన్న దానిపై హైదరాబాద్‌లో పెద్ద పంచాయితీ జరిగినా డిజిపి దినేష్‌రెడ్డి వారిద్దరికీ సర్దిచెప్పి పంపినట్లు తెలిసింది. బ్రదర్స్‌కు గులాంగా మారని అధికారులు నెల్లూరులో పనిచేయడం కష్టం. వెంకటనాథ్‌రెడ్డి ఎలా పనిచేస్తారో చూసి మాట్లాడుదాం!

3 కోట్ల రూపాయలతో ఆలయాల పునర్నిర్మాణం!

జిల్లాలో చరిత్ర గల దేవాలయాలను మూడు కోట్ల రూపాయలు వెచ్చించి పునర్నిర్మాణం చేయనున్నట్లు పురావస్తు ప్రదర్శన శాఖ ఇన్‌ఛార్జ్ డైరక్టర్ జి.వి. కృష్ణారావు ప్రకటించారు. గూడూరు మండలంలోని కోడూరు గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయానికి 20 లక్షలు, గండవరం ఉదయకాళేశ్వర స్వామి దేవస్థానానికి 15 లక్షలు, మహిమలూరు చెన్నకేశవ స్వామి ఆలయానికి 20 లక్షలు, ఉలవపాడు వీరాంజనేయ స్వామి ఆలయానికి 20 లక్షలు, తడ మండలం మాంబట్టులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి పది లక్షలు, కోటి తీర్థంలోని కోటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి 1.50 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు.

రొట్టెల పండుగ కమిటీ ఛైర్మన్‌గా జకీర్!



బారాషహీద్ దర్గా వద్ద జరిగే రొట్టెల పండుగ కమిటీ ఛైర్మన్‌గా షేక్.జకీర్ హుస్సేన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జకీర్ హుస్సేన్ 'యాదే రఫీ' కార్యక్రమం ద్వారా నెల్లూరీయులకందరికీ సుపరిచితుడు. జంట ఎమ్మెల్యేలు వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డి దగ్గరగా మసిలే వ్యక్తి కావడం, క్లీన్ చిట్ ఉండడంతో ఆయన్ను ఈ పదవి వరించింది. ఫెస్టివల్ కమిటీ 224 మంది సభ్యుల జంబోజెట్‌గా రూపొందించాడు వివేకానందరెడ్డి. ఫెస్టివల్ కమిటీ ఛైర్మన్‌గా తనదైన ముద్రతో పనిచేసి జకీర్ పేరు తెచ్చుకోవాల్సి ఉంది.

మే నెలలో మధ్యంతర ఎన్నికలు!

కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం కుప్పకూలుతుందని లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు మే నెలలో వస్తాయని

కొరవ 14వ పేజీలో

ఫంగస్, చేపల
రైతులకు గొప్ప అవకాశం
చేపల మేత 1 Kg. రూ. 20
(పిల్లెట్) ప్రోటీన్ 23%
జాబ్‌వర్క్ కూడా చేయబడును
గోల్డెన్ ఫీడ్స్ పెద్దపడుగుపాడు నెల్లూరు.
సం. 08622-258596 9440279762

వజ్రం - బంగారం - వెండి
ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

● పోరాటాలతోనే

సమస్యలు పరిష్కారం!

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు సలహా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్పీ మధు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్పీ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు పెనుబల్లి మధు పిలుపునిచ్చారు. 16వ తేది బాలాజీనగర్‌లోని సిపిఎం ఆఫీసులో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్సూరెన్స్, పెన్షన్ ఫండ్, విమానయాన రంగం, విద్యుత్ రంగాల్లో విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడంతో సామాన్యునిపై పెనుభారం పడిందన్నారు. వంట గ్యాస్ సబ్సిడీ సిలిండర్ల సంఖ్య కుదించడం దారుణమన్నారు. బొగ్గు గనులను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడం వల్ల ప్రభుత్వ ఖజానాకు 1.89 లక్షల కోట్ల రూపాయల నష్టం వచ్చిందన్నారు. గతంలోనూ కేంద్ర ప్రభుత్వం 2జి స్పెక్ట్రం కూడా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని ప్రైవేటు వ్యక్తులకు దోచి పెట్టిందన్నారు. చిల్లర వర్తకంలో ఎఫ్‌డిఐలను ఆహ్వానించడం వల్ల నాలుగు కోట్ల మంది వ్యాపారులు జీవనోపాధి కోల్పోతారన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు జక్కా వెంకయ్య, చంద్ర రాజగోపాల్, పి.శ్రీరాములు, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఊరిస్తున్న విమానాశ్రయం!

దామవరంలో పెడుతామన్న ఆర్థిక మంత్రి

జిల్లాలో గత మూడు సంవత్సరాల నుంచి విమానాశ్రయం ఏర్పాటు గురించి ఎవరికి తోచిన విధంగా వారు ప్రచారం చేసుకుంటున్నారు. తొలుత దగదర్తి మండలం జాతీయ రహదారికి సమీపంలో విమానాశ్రయం ఏర్పాటు జరుగుతుందని ప్రకటించారు. ఆరు నెలల అనంతరం నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు సమీపంలో ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగింది. దీనిని కొందరు అధికారులు కూడా అనధికారికంగా వెల్లడించడం జరిగింది. గత ఏడాది జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన వసతులు లేవని తాత్కాలికంగా విమానాశ్రయం ఏర్పాటు విరమించుకొన్నట్లు మరో ప్రచారం జరిగింది. గత వారం రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దగదర్తి మండలంలో విమానాశ్రయం ఏర్పాటు జరుగుతుందని ప్రకటించారు. ఇందుకు అవసరమైన భూ సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు ఉన్న ఊహాగానాలకు మంత్రి ప్రకటనతో తెరదించినట్లైంది. ఈ నేపథ్యంలో అక్కడ భూములు అధిక ధరలు పలికే అవకాశం ఉంది. గతంలో ఈ ప్రాంతంలో భూములు కొన్నవారు విమానాశ్రయం ఏర్పాటు జరగదని భావించి తక్కువ ధరకు విక్రయించుకున్నారు. సాక్షాత్తు జిల్లా మంత్రి విమానాశ్రయం ఏర్పాటుపై ప్రకటన చేయడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. మొత్తంమీద విమానాశ్రయం జిల్లా ప్రజలను ఊరిస్తుండడం విశేషం.

● విజయా డైరీ

హాలీడే వెనుక మతలబు?

రెండు రోజుల్లో రూ.22 లక్షలు నష్టపోయిన పాల రైతులు



విజయా డైరీ వివాదాస్పద నిర్ణయం.

అందరూ హాలిడే ప్రకటించగా లేనిది తమ కెందుకు మినహాయింపని అనుకుందేమో నెల్లూరు విజయా డైరీ యాజమాన్యం రెండు రోజులపాటు పాల సేకరణకు సెలవు చీటి పెట్టింది. దీంతో జిల్లా వ్యాప్తంగా పాడి రైతులు ఆందోళనలో పడ్డారు. కొలతకు కొద్ది పాలు తగ్గితే తట్టుకోలేని పాడి రైతులు ఈ ఆకస్మిక సెలవు ప్రకటనకు ఖంగు తిన్నారు. ఇదే అలవాటు కొనసాగితే తమ కుటీర పరిశ్రమ దెబ్బతింటుందన్నారు. ధరలు పెంచడానికే డైరీ ఈ ఎత్తుగడ వేసిందని పాల వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ నెల్లూరు విజయా డైరీ 75వేల లీటర్ల పాలు సేకరిస్తుంది. మార్కెట్‌లో విజయా పాలకు బాగా డిమాండ్ ఉన్నా 18వేల లీటర్లనే అమ్ముతుంది. నెల్లూరుపాళెం నుంచి ఒక ట్యాంకర్, వెంకటగిరి నుంచి మరో ట్యాంకర్‌ను తీసుకొచ్చి ఆ పాలను చెన్నై విజయ వాడలకు సరఫరా చేస్తుంది. తమ వద్ద లక్షా 50 వేల లీటర్ల పాలు ఇప్పటికే ఉండడం వల్ల ఇంకా నిల్వచేసే సామర్థ్యం లేక తాత్కాలికంగా పాల సేకరణ ఆపినట్లు డైరీ ఎండి చెప్పారు. కానీ సెలవుల ప్రకటన వెనుక పెద్ద మతలబు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పాడి రైతుల నుంచి సేకరించే పాలు ధర తగ్గించి కొనుగోలు చేసేందుకు ప్రైవేటు డైరీలు వ్యూహం రచించాయి. ఈ బాటలోనే నడవాలని విజయా డైరీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీనిలో భాగమే ఈ పాల సేకరణకు హాలీడే ప్రకటన. ఇటీవల దక్షిణ భారతదేశంలోని ప్రైవేటు పాల డైరీల యాజమాన్యాలు బూదనంలో అత్యవసర సమావేశాన్ని రహస్యంగా నిర్వహించాయి. దీనిలో స్థానికంగా పాల సేకరణ, అమ్మకాలు తగ్గించి ప్రభుత్వం ద్వారా విదేశాలకు పాలు ఎగుమతి చేసుకొనే డిమాండ్‌ను నెరవేర్చుకోవాలని తల పెట్టాయి. విదేశాల్లో పాలకు గిరాకీ అధికంగా ఉండడంతో ఎగుమతి రుసుం తగ్గించుకోవాలన్న డిమాండ్ సాధనకు డైరీలు హాలీడే బాట పట్టాయంటున్నారు. ఈ బాటలోనే అడుగులు వేయను విజయా డైరీ ఈ సెలవుల ప్రకటన చేసిందంటున్నారు. ఈ డైరీ సెలవుల మూలంగా రెండు రోజులకుగాను రోజుకు పది లీటర్ల చొప్పున పాలుపోసే రైతు కుటుంబీకులు 600 రూపాయల చొప్పున నష్టపోయారు. మొత్తంగా గుణిస్తే 22 లక్షలా 50 వేల రూపాయల ఆదాయం పాల రైతులు కోల్పోయారన్న మాట.

తూగుతున్న తూకాల శాఖ!

ఆగని తూనికలు కొలతల్లో మోసాలు



పనిచేయని శాఖల్లో ప్రథమ స్థానం.

జిల్లాలో తూనికలు కొలతల శాఖాధికారులు నిద్రావస్థలో ఉన్నారు. దీనివల్ల ప్రజలు నాణ్యతలేని వస్తువులు కొనుగోలు చేయడమేగాక తూనికల మోసాలతో బేజారవుతున్నారు. జిల్లాలో తూనికలు కొలతల శాఖకు సహాయ కమిషనర్, నెల్లూరు, గూడూరు, కావలి డివిజన్లలో ఇన్స్‌పెక్టర్లు పనిచేస్తున్నారు. వీరి పర్యవేక్షణలో తనిఖీలు జరిపి మోసాలను అరికట్టాలి. అవసరమైతే కేసులు నమోదు చేయాల్సి ఉంది. ప్రతి సంవత్సరం ఈ శాఖ నేతృత్వంలో తూనికల త్రాసులకు, తూకపు రాళ్లకు ముద్రలు వేస్తుంటారు. కానీ వ్యాపారస్తులు ఈ త్రాసు తాళ్లను ప్రక్కనపెట్టి వేరే వాటిని వాడుతున్నారు. నెల్లూరు నగరంలో ఎలక్ట్రానిక్ తక్కెడలలో సైతం ఇష్టమొచ్చినట్లు మార్పులు చేసుకొని ఉన్నారు. దీనివల్ల కిరాణా, ధాన్యం వ్యాపారులు, మిల్లర్లు, డీజిల్, పెట్రోల్ అమ్మకందార్ల చేతిలో వినియోగదారులు నష్టపోతున్నారు. నిత్యావసర వస్తువుల ప్యాకెట్లపై ధర, ఇతర వివరాలు పొందుపరచకుండా వీటిని అమ్మేస్తున్నారు. సినిమా హాళ్లలో తినుబండారాలు, కూల్‌డ్రింక్‌లు నిర్ణీత ధర కన్నా ఎక్కువగా అమ్ముతున్నారు. నెల్లూరు ఎసి కూరగాయల మార్కెట్, సందాని బాష జలపుష్పభవన్ దాని చుట్టుప్రక్కల మాంసం దుకాణాల్లో తూకపు మోసం తీవ్రంగా ఉంది. నెల్లూరుకు కొత్తగా వచ్చిన తూనికలు కొలతల ఇన్స్‌పెక్టర్ జలదంకి నాగేశ్వరరావు నెలరోజులపాటు హంగామా చేసి గమ్మునైపోవడం వెనుక కారణాలు తెలియరాలేదు. ఏదిఏమైనా జిల్లాలో తూకాల శాఖ తూగుతున్న శాఖగా అభివర్ణించవచ్చు.

ఆర్టీసి అవగాహనాలోపం - ప్రయాణీకులకు శాపం!

రెండవ డిపో మేనేజర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.

రెండవ డిపో పరిధిలోని ఆర్టీసి అధికారుల అవగాహన లోపం వల్ల ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సులెక్కే ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ బస్టాండ్ నుంచి ఇందుకూరుపేట, మైపాడు, కొరుటూరు, రాముడుపాళెం, కోడూరు, కొత్త కోడూరు, కొత్తపాళెం, వెంకన్నపాళెం, వేళాంగిణి, అనంతపురం, ఈదూరు ప్రాంతాలకు వెళ్లే బస్సు వేళలను మార్చడంతోపాటు కొన్ని బస్సులను నిలిపి వేశారు. దీనివల్ల ప్రయాణీకులు ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని అవసరాలను గుర్తించి ప్రయాణీకుల ఆమోదంతో బస్సులు నడపాల్సి ఉంది. విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలు ప్రాతిపదికలోకి తీసుకోవాల్సి ఉంది. కానీ కేవలం రూట్లలో నష్టాలు వస్తున్నాయని ఫ్రీ పాసులు, సీజనల్ పాసులు అధికంగా ఉన్నాయని కారణాలు చెప్పి ఆర్టీసి ప్రయాణీకులను నిర్లక్ష్యం చేస్తుంది. ఉదాహరణకు కొత్తకోడూరు గ్రామానికి రెండు డేఔట్ బస్సులు తిరుగుతున్నాయి. ఒకటి నెల్లూరులో ఉదయం ఐదు గంటలకు, మరొకటి ఆరు గంటలకు బయలుదేరి నరుకూరు వైపుగా కోడూరు వచ్చేవి. దీంతో ప్రయాణీకులకు ఇబ్బంది ఉండేది కాదు. కేవలం ఆదాయం తగ్గిందని రెండవ బస్సును రద్దుచేసి మొదటి బస్సు టైమింగ్ మార్చేయడంతో ప్రయాణీకులు బస్సు కోసం బస్టాండ్‌లో పడిగాపులు కాయాల్సి వస్తుంది. గత్యంతరం లేక ఆటోలు ఎక్కుతున్నారు. రెండవ డిపో మేనేజర్ షమీమ్‌కు మంచి అధికారిగా పేరుంది. ఆమె క్రింది స్థాయి అధికారుల మాట వినకుండా స్వయంగా ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయి పర్యటన చేస్తే సమస్యలు తీరుతాయని ప్రజలు భావిస్తున్నారు.



ఆర్టీసి బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణీకులు.

కావలి

రైసుమిల్లుల్లో రేషన్ బియ్యం!

రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి వున్న రైస్‌మిల్లుపై పోలీసులు దాడి చేయడం కావలిలో కలకలం రేపింది. పట్టణం నుంచి గత కొంతకాలంగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు ఒక కన్నేసి వున్నారు. అక్రమార్కులను పట్టుకొనేందుకు రెవెన్యూ, పోలీస్‌శాఖ ప్రయత్నిస్తున్నా దొరకకుండా బియ్యాన్ని పలు మార్గాలలో తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కావలి పాతవూరులోగల లక్ష్మీ మోడరన్ రైస్ మిల్లుపై పోలీసులు దాడి చేయగా 230 బస్తాల రేషన్ బియ్యం దొరికింది. రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులకు లోడ్‌తో అనుమానాస్పదంగా వెళ్తున్న లారీ కన్పించడంతో కానిస్టేబుల్ వినోద్ లారీని అనుసరించగా అది నేరుగా ఆ రైస్ మిల్లుకు చేరింది. అందులో నుంచి బియ్యం బస్తాలను దించుతుండగా కానిస్టేబుల్, ఎస్‌ఐ వీరంద్రబాబుకు సమాచారం అందించాడు. ఆయన తన సిబ్బందితో వచ్చేటప్పటికి బియ్యాన్ని తెల్ల గోతాలలోకి మార్చి వేయగా, మరో 86 బస్తాలు అక్కడే దొరికాయి. సమాచారాన్ని కావలి తహశీల్దార్‌కు అందించడంతో ఆయన వచ్చి బియ్యాన్ని పరిశీలించి అవి రేషన్ బియ్యమేనని తేల్చారు. బియ్యం వున్న బస్తాలను ఎఫ్‌సిఐ గోడౌన్‌కు పంపించి మిల్లు యజమాని కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన జరగగంగానే రైస్ మిల్లు యజమానిని కాపాడేందుకు కొందరు నేతలు రంగంలోకి దిగారు. కాంగ్రెస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు తమ పలుకుబడి ఉపయోగించి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు ఆరంభించినట్లు సమాచారం. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో నగదు ఇచ్చేందుకు బేరసారాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

కేసు నీరుగార్చే యత్నం

భూ పంపిణీ జాబితాలో అనర్హులు!

● అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో నిలదీసిన కురుగొండ్ల!

ఆరవ విడత భూపంపిణీకి సంబంధించి వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో తయారు చేసిన జాబితా అంతా బోగస్ అని, ఇందులో అర్హులు లేరని అందరూ అనర్హులేనని స్థానిక శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. ఇటీవల వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విఆర్ఓలు కీలకపాత్ర పోషించి బోగస్ పేర్లతో జాబితా తయారు చేశారన్నారు. కొంత మంది వద్ద ముడుపులు అందుకొని విఆర్ఓలు తప్పుడు జాబితా రూపొందించారని ఆరోపించారు. బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో అర్హులను ఎంపిక చేయలేదన్నారు. యాచవరం విఆర్ఓ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని పట్టాలు ఇచ్చేందుకు కొంతమందితో చేతులు కలిపారన్నారు. డక్కిలి మండలంలో ఎంతమందికి పట్టాలు ఇస్తున్నారో తెలపాలని నెలరోజుల క్రిందట లేఖ వ్రాసినా ఇంతవరకు సమాధానం తెలపలేదన్నారు. దండోరా వేయకుండా గ్రామ సభలు జరపడం వలన అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండానే అటవీ పోరంబోకు భూమిని ఎలా చెప్తారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు తయారు చేసిన జాబితాపై విచారణ జరిపించి తగిన చర్యలు చేపట్టాలని గూడూరు సబ్ కలెక్టర్ నివాస్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ జాబితాపై విచారణ చేస్తామన్నారు. ఎమ్మెల్యే విఆర్ఓలపై చిటపటలాడడంతో సమావేశం వాయిదా పడింది.

ఆర్టీసి సిబ్బంది పనితీరు మారాలి!

సిటిఎం సామ్రాజ్యం ఆవేదన

కావలి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు అపరిశుభ్రంగా వుంటే సంబంధితులపై చర్యలు తీసుకుంటామని ఆర్టీసి సిటిఎం సామ్రాజ్యం హెచ్చరించారు. ఆమె ఇటీవల కావలి ఆర్టీసి డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్సులను శుభ్రంగా వుంచి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకుగాను బస్సులను శుభ్రపరచే బాధ్యతలను కాంట్రాక్టర్‌లకు అప్పగించామన్నారు. ప్రతిరోజు ప్రతి బస్సును శుభ్రపరచే బాధ్యత వారిదేనన్నారు. అందుకోసం టెండర్లు పిలిచి పని అప్పగించామన్నారు. ఇకపై వివిధ ప్రాంతాల బస్సుల్లో శుభ్రతలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఏడాది జిల్లాకు 37 కొత్త బస్సులు రావాల్సి వుండగా ఇప్పటివరకు ఆరు బస్సులు వచ్చాయన్నారు. దసరా సందర్భంగా జిల్లావ్యాప్తంగా 160 బస్సులు నడుపగా 39 లక్షల రూపాయలు అదనపు ఆదాయం సమకూరిందన్నారు. ఒక్క కావలి డిపోలో మాత్రం ఏడు లక్షల రూపాయల నష్టం వచ్చిందన్నారు. ఇక్కడ పని చేసే స్టాఫ్, వర్కర్లు తమ పని తీరు మార్చుకోవాలని లేకపోతే అసలుకే మోసం వస్తుందని హెచ్చరించారు. శబరిమలై సీజన్‌ను పురస్కరించుకొని అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో సిటిఎం వెంట డిపో మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు × ఎంఇఓ

బోగోలు మండలంలో ఉపాధ్యాయులు, మండల విద్యాధికారి మధ్య నెలకొన్న వివాదం కారణంగా విద్యార్థుల చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వీరు ఒకరిపైనొకరు ఆరోపణలు చేసుకొంటూ కాలక్షేపం చేస్తుండడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక, బోధన కుంటుపడుతోంది. మండలంలో పని చేసే ఉపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారికి కొంతకాలంగా వివాదం నడుస్తోంది. తమ సమస్యలు పరిష్కరించడం లేదని అయ్యోర్లు, పాఠశాలలకు సక్రమంగా వెళ్లండని చెప్తే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆమె చెప్తుండడంతో మండలంలో విద్యాశాఖ అగుడు పట్టిపోయింది. యుటిఎఫ్, ఎస్‌టియు తదితర సంఘాలు మండల విద్యాశాఖాధికారిణి శైలజ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లేదని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, సరిగా

బోగోలులో రచ్చ

సమాధానం చెప్పరంటూ ఆరోపించడమేకాక మండల అభివృద్ధి అధికారిణి కనకదుర్గా భవానికి వినతిపత్రం సమర్పించడం చర్చనీయాంశమయ్యింది. మరోవైపు ఎంఇఓ శైలజ మాట్లాడుతూ పాఠశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో ప్రశ్నించానని, విధులకు నామం పెట్టడమేకాక అడిగినందుకు తనపై ఆరోపణలకు దిగుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు న్యాయమైన సమస్యలు పరిష్కరించినా కావాలని తనపై బురద చల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఉపాధ్యాయులు, ఎంఇఓ మధ్య వివాదం సంగతి అటుంచితే నాలుగు ముక్కలు చదువుకొనేందుకు పాఠశాలకు వెళ్లే విద్యార్థుల చదువు మాత్రం గోవింద కొడుతోంది.

విజయ డైరీ వైఫల్యం!

మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి విమర్శ

డైరీ నిర్వాహకులకు ముందుచూపు కొరవడడం వలనే పాలసేకరణ నిలుపు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని విజయడైరీ మాజీ చైర్మన్, వైకాపా నేత చిల్లకూరు సుధీర్‌రెడ్డి విమర్శించారు. పొట్లపూడి గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డైరీ ఎండి అవగాహన లోపం ఈ విషయంలో స్పష్టమైందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పరస్పర సహకార సంఘాలతో నడుస్తున్న విజయడైరీ పాలసేకరణ నిలచి పోయిందన్నారు. పాల సేకరణ నిలుపుదల చేసే విషయం డైరీ చైర్మన్‌కు కూడా ముందు తెలియలేదంటే ఆయన పని తీరు ఎలా వుందో అర్థమౌతుందని చురకలు అంటించారు. ఈ నిర్ణయం వలన రైతులు రెండు రోజుల్లో 30లక్షల రూపాయలు నష్టపోయారన్నారు. అదనంగా వచ్చిన పాలను పాలపొడిగా మారిస్తే రైతులపై భారం వుండదని, కన్వర్షన్ ఛార్జీలు భరిస్తే సరిపోతుందన్నారు. అడ్డదిడ్డమైన నిర్ణయాలు తీసుకొంటే రైతులు నష్టపోవడంతోపాటు ప్రైవేట్ డైరీల వైపు ఆసక్తి చూపుతారని దీని ప్రభావం డైరీపై వుంటుందన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకొని డైరీ అధికారులు, పాలకులు మార్కెటింగ్‌లో చొరవ చూపితే నష్టాలను అధిగమించ వచ్చన్నారు.

కోట ఎస్‌ఐ బదలీ రచ్చ వెనుక పీనబాక!

ఇంత దిగజారుడుతనమా?

కోట ఎస్‌ఐ వెంకటరమణ నిక్కచ్చి వ్యవహారం అధికారపార్టీ నేతలకు మింగుడు పడడంలేదు. నిఖార్సుగా డ్యూటీ చేయడం, బాధితులకు అండగా నిలవడం, తప్పుచేస్తే ఎంతటి వారైనా విడిచి పెట్టకపోవడంతో కాంగ్రెస్‌పార్టీ నేతలకు కంట్లో నలుసుగా మారాడు. ఎలాగైన ఆ ఎస్‌ఐను అక్కడి నుంచి తప్పించేందుకు నందిని అనే అమ్మాయిని ప్రయోగించారు. ఆమె ఎస్‌ఐ తనను మోసం చేశాడని నానా రభస చేసింది. ఈ వ్యవహారంలో స్థానికులు ఎస్‌ఐకు అండగా నిలబడ్డారు. వున్నట్లుండి నందిని ఎస్‌ఐ తనను మోసం చేయలేదని, కొందరు పోలీసులు, విలేకరులు, నేతలు కలసి డబ్బు ఆశ చూపి నాటకం ఆడించారని చెప్పడంతో ఈ వ్యవహారం బోగస్ అని తేలిపోయింది. ఈ నేపథ్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు కారు అడ్డం పెడితే ఎస్‌ఐ అతనికి నాలుగు తగిలించి పోలీస్ అంటే ఏంటో తెలియజేశాడు. ఇదేకాకుండా బెల్టు షాపులు మూయించి వేయడంతో కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, ఆమె భర్త కృష్ణయ్యలు ఎస్‌ఐపై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఎలాగైనా ఎస్‌ఐను అక్కడ నుంచి బదలీ చేయించాలని విఆర్‌కు పంపాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అందుకోసం ఎస్పీపై పెద్దఎత్తున ఒత్తిడి తెస్తున్నారట. దీనిలో భాగంగా పోలీస్ అధికారులు ఇటీవల వాకాడు వచ్చి గెస్ట్‌హౌస్‌లో విచారణ జరిపారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించారు. దీంతో ఎస్‌ఐను కక్షతో బదలీ చేస్తున్నారని తెలుసుకొన్న స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి ఎస్‌ఐకు మద్దత్తుగా నిలిచారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాకాడు సిఐ శ్రీనివాసరావు, సూళ్లూరుపేట సిఐలు రత్తయ్యలు ఆందోళనకారులకు నచ్చచెప్పినా ఫలితం లేకపోవడంతో లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. నిఖార్సుగా డ్యూటీ చేస్తున్న ఎస్‌ఐపై జిల్లా ఎస్పీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడనేది చర్చనీయాంశమయ్యింది.

క్రీడలను ప్రోత్సహించని స్కూళ్లపై చర్యలు!

కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు సూచన

క్రీడలకు ప్రోత్సాహం కరువైందని, ప్రైవేట్ విద్యాసంస్థలు క్రీడారంగాన్ని విస్మరిస్తున్నాయని కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు విమర్శించారు. ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జవహర్‌భారతి క్రీడా మైదానంలో వివిఎస్‌యు అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ క్రీడారంగాన్ని అన్ని విద్యాసంస్థలు విస్మరించడం బాధాకరం అన్నారు. కేవలం ర్యాంకులు, మార్కుల సాధనకే విద్యాసంస్థలు ప్రాధాన్యమిస్తున్నాయి తప్ప విద్యార్థుల మానసిక ఉల్లాసాన్ని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి విద్యాసంస్థలో క్రీడలు నిర్వహించేలా, ప్రతి ఒక్కరు ఇలాంటి క్రీడల్లో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేదంటే అలాంటి సంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఎంఎస్ఆర్ కళాశాల కరస్పాండెంట్ రాజకుమార్ చౌదరి, విశ్వోదయ రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల కోసం నానా తిప్పలు!

● పాపం బోగోలువాసుల బాధ వర్ణనాతీతం



బోగోలు మండలంలోని గ్యాస్ వినియోగదారులకు సిలిండర్ల కొరత తీవ్ర ఇబ్బంది పెడుతోంది. గ్యాస్ బుక్ చేసిన వారికి సకాలంలో సిలిండర్ల సరఫరా జరగకపోవడంతో మండల ప్రజలు వీటి కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. సక్రమంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా జరగకపోవడం, ఏజన్సీలు అవకతవకలకు పాల్పడతుండడంతో ఈ సమస్య ఎదురౌతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బుక్ చేసిన ఎన్ని రోజులకు సిలిండర్ సరఫరా చేస్తారో తెలియడం లేదని, అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తుంటారని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో సిలిండర్ల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వినియోగదారులు గ్యాస్ సిలిండర్లను తీసుకొని పోయేందుకు ఏజన్సీ వద్దకు రావడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడుతోంది. అధికమొత్తం చెల్లించిన వారికి అడిగిన వెంటనే సిలిండర్లు అందిస్తున్నారని వినియోగదారులు చెబుతుండగా, నిర్వాహకులు మాత్రం సక్రమంగానే సరఫరా జరుగుతుందని చెప్తుండడంతో తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దగదర్తి, జలదంకి మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడి వినియోగదారులు గ్యాస్ కష్టాలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాలశాఖాధికారులు ఈ సమస్యపట్ల స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



అవిశ్వాసం ఎలాపెట్టాలో తెలుసు!

తెలుగుదేశంపార్టీపై వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. విడవలూరు మండలం గాదెలదిన్నె తదితర గ్రామాల్లో పర్యటించిన సోమిరెడ్డి అక్కడి కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టకుండా పార్టీతో కుమ్మక్కైందని వైఎస్ఆర్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. వైఎస్ షర్మిళ, అంబటి రాంబాబు లాంటి వాళ్లు

విడవలూరులో సోమిరెడ్డి

అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో రాజీనామా చేసి వుంటేనో, ప్రభుత్వం మైనార్టీలో పడినప్పుడో, రాష్ట్రంలో సంక్షోభం ఏర్పడిన పరిస్థితులలో, ప్రజలకు తీవ్ర విఘాతం ఏర్పడినపుడు అవిశ్వాస తీర్మానం పెడతారన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండానే తెలుగుదేశంపార్టీ అవిశ్వాసం పెట్టడం లేదని, కాంగ్రెస్‌పార్టీతో కుమ్మక్కైందని పదేపదే ఆరోపణలు చేయడం ప్రజలను ప్రక్కదారి పట్టించడమేనన్నారు. ఇప్పటికైనా వైఎస్ఆర్ పార్టీ నేతలు వాస్తవాలు మాట్లాడడం నేర్చుకోవాలన్నారు.

● నేలపట్టు

రక్షణ గోడకు పగుళ్లు

అందులేదన్నట్లు ప్రతి పనిలోనూ, చేపట్టే కార్యక్రమాల్లో అవినీతి ప్రబలిపోతూనే వుందనేందుకు నేలపట్టులో నిర్మించిన రక్షణ గోడ ఉదాహరణ. ఇక్కడి పక్షుల కేంద్రానికి పటిష్టమైన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం 96 లక్షల రూపాయలతో రెండు కిలోమీటర్ల మేర గోడ నిర్మించారు. నిర్మాణ పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకోవడంతో కట్టిన కొన్నినాళ్లకే గోడ బద్దలు బద్దలుగా పగిలిపోయింది. దీంతో గోడ నిర్మాణంలో జరిగిన అవినీతి బట్ట బయలైంది. ఆ నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ

విచారణకు ఏర్పాటు చేసిన చీఫ్ కన్సర్వేటర్

లేకపోవడంతో పక్షుల రక్షణకు నిర్మించిన గోడలోను అవినీతి చోటు చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఎట్టకేలకు దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణకు ఆదేశించడంతో తిరుపతి నుంచి చీఫ్ కన్సర్వేటర్ చలపతిరావు, పవన్‌కుమార్ తదితరులు బృందంగా ఏర్పడి విచారణ చేపట్టారు. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇవ్వడం వల్లే పగుళ్లు ఏర్పడ్డాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు చేపడుతామన్నారు.

అనర్హులకు భూములు పంచితే ఉద్యమం!

దగదర్తి రైతు సంఘం నేతల హెచ్చరిక

దగదర్తి మండలంలో ఆరవ విడత భూపంపిణీకి ఎంపికైన లబ్దిదారుల్లో అధికభాగం అనర్హులే వున్నారని, అలాంటి వారికి భూములు పంచితే ఉద్యమిస్తామని రైతు సంఘం నేతలు హెచ్చరించారు. అర్హులను ఎంపిక చేసి భూములు పంచాల్సి వుండగా అనర్హులనే ఎంపిక చేయడంలో అధికారులు, కొందరు నేతల పాత్ర వుందని రైతు సంఘం నేతలు రవీంద్రనాథ్‌రెడ్డి, బలిజేపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని పేదలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 11వేల ఎకరాల ప్రభుత్వ భూమి వుండగా అందులో అధికభాగం పెద్దల చెప్పుచేతల్లో వున్నాయన్నారు. దీని గురించి పట్టించుకోని అధికారులు భూపంపిణీలో సైతం పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. అక్రమార్కులతో కుమ్మక్కై అనర్హులను లబ్దిదారుల జాబితాలో చేర్చి భూపంపిణీకి సిద్ధపడడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికైనా అధికారులు చేసిన తప్పులను దిద్దుకొని అర్హులైన పేదలకు భూములు అందేలా చూడాలన్నారు. లేదంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఈ సమస్యపై తహశీల్దార్ లీలావతిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో రైతు సంఘం నేతలు కోటిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కావలిలో ఎమ్మీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో వేస్తున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైకాపా నేత రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి.

● మాగుంట పార్వతమ్మ

రామాయణ పఠన కార్యక్రమం!



మాజీ శాసనసభ్యురాలు మాగుంట పార్వతమ్మ కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కావలి రూరల్ మండలం ముసునూరులో గల ఆమె నివాసంలో వాల్మీకి రామాయణ పఠనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంపై మాగుంట పార్వతమ్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో వాల్మీకి రామాయణాన్ని పఠించడం వలన మంచి జరుగుతుందన్న భావనతోనే తన నివాసంలో దీనిని ప్రారంభించామన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ పఠనం సాగుతుందన్నారు. ప్రారంభ కార్యక్రమానికి మాగుంట పార్వతమ్మతోపాటు కాంగ్రెస్ నాయకులు యానాదిశెట్టి, చింతాల వెంకట్రావ్, రాజకుమార్ చౌదరి, దామిశెట్టి శ్రీనివాసులనాయుడు, కనమర్లపూడి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఒళ్లు దగ్గరపెట్టుకొని పని చేయండి!

● అధికారులను హెచ్చరించిన కలెక్టర్



పేదలకు వ్యక్తిగత సహాయంగా అందజేసే రుణాల పంపిణీలో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ శ్రీధర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడిన ఆయన వారి పని తీరుపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాలలో లబ్దిదారుల వ్యక్తిగత సహాయం నిమిత్తం అందజేసే రుణాలను ఆయా ప్రాంత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. మనం పని చేసేది ప్రజల కోసం అన్న సంగతి గుర్తుంచుకోమన్నారు. ప్రభుత్వం ఇచ్చే నగదును ప్రజలకు అందించడంలో మీకు కలిగే ఇబ్బంది ఏంటని అధికారులను ప్రశ్నించారు. దీనికి వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఇలాగైతే పనులు ఎలా జరుగుతాయి. పేదలకు ఏమి న్యాయం జరుగుతుందన్నారు. ఎన్ఎఫ్‌బిఎస్ చెక్కుల పంపిణీలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, పద్ధతి మార్చుకోకపోతే అలాంటి వారిపై తాను తీసుకోబోయే చర్యలు కఠినంగా వుంటాయన్నారు. అలాగే ఖర్చు చేసిన మొత్తాలకు లెక్కలు సక్రమంగా నిర్వహించాలన్నారు.

గ్యాస్ సిలిండర్లపై ఆంక్షలు తొలగించాలి!

కేంద్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలకు తొలగించిన గ్యాస్ సిలిండర్లపై రాయితీని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కావలి పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆందోళన చేపట్టింది. స్థానిక బ్రిడ్జి సెంటర్ వద్ద నుంచి ఎస్ఎఫ్ఐ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం


కావలిలో ఎస్ఎఫ్ఐ నిరసన

తోపాటు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసింది. ఈ ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ నేత ఎన్.రవి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వలన హాస్టళ్లలో వుండి చదువుకొంటున్న విద్యార్థుల పరిస్థితి మరింత దిగజారుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదని, చాలీచాలని ఆహారాన్ని అందిస్తున్నారని ఈ పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీని రద్దు చేయడం వల్ల విద్యార్థులపై మరింత ప్రభావం చూపుతుందన్నారు. కావలి డివిజన్‌లో 32 సంక్షేమ హాస్టళ్లు వున్నాయని, వీటిలో దాదాపు మూడువేల మంది విద్యార్థులు వున్నారని తెలిపారు. వీరిపై నెలకు షుమారు 500 రూపాయల వంతున ఖర్చు చేస్తుండగా, సిలిండర్లపై అదనపు భారం మోపడం వలన వారికి ఇస్తున్న ఆహారం, ఇతరత్రా వాటిపై కోత విధించాల్సిన పరిస్థితి ఎదురు కానుందన్నారు. హాస్టల్ విద్యార్థులను దృష్టిలో వుంచుకొని తక్షణం గ్యాస్ సిలిండర్లపై రాయితీని పునరుద్ధరించాలని లేకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు బాబు, వెంకటేష్, కృష్ణా రెడ్డి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆటంకంగా...

వన్యప్రాణి సంరక్షణ చట్టం!

గూడూరు ఎమ్మెల్యే విమర్శ



గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఎంతగానో ప్రయత్నిస్తున్నా వన్యప్రాణి సంరక్షణశాఖ ఆంక్షల కారణంగా అభివృద్ధికి ఆటంకాలు ఎదురౌతున్నాయని గూడూరు శాసనసభ్యుడు బల్లి దుర్గాప్రసాద్ తెలిపారు. నియోజకర్గ పరిధిలో గల కోట తదితర ప్రాంతాలలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులకు వన్యప్రాణి సంరక్షణశాఖ వల్ల శ్రీకారం చుట్టలేకపోతున్నామ న్నారు. పలు ఆంక్షలు విధించడం వలన ఈ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వం ఆ ఆంక్షలను తొలగింపజేసి అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతివ్వాలన్నారు. ఆరో విడత భూపంపిణీలో అర్హులైన పేదలందరికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. గతంలో జరిగిన భూపంపిణీలో అనర్హులకు భూములు దక్కాయని, వీటి వెనుక కొందరు నేతలు పాత్ర వుందన్నారు. అలాంటి అవకతవకలకు అధికారులు స్వస్తిపలికి అర్హులకే భూములు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో తాగునీటి సమస్య అధికంగా వుందని, దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు దృష్టి నిలిపి మంచినీటి సమస్యను తక్షణం పరిష్కరించేలా చూడాలన్నారు. ఇటీవల సంభవించిన నీలం తుఫాను కారణంగా పంటలు నష్టపోయి రైతులు దెబ్బతిన్నారని, ప్రజలు నష్టపోయారన్నారు. వీరిని ఆదుకోవడంలో అధికారులు తగిన విధంగా వ్యవహరించి రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలన్నారు.

రాపూరులో ప్రాచీన బలిపీఠం మాయం!

జిల్లాలోని వివిధ ఆలయాలు, పురాతన విగ్రహాలకు రక్షణ కరువైంది. విగ్రహాలను తస్కరించే ముఠాలు సంచరిస్తుండడంతో ఇటీవల ఉదయగిరి తదితర ప్రాంతాలలో గల పురాతన విగ్రహాలను అపహరించుకొని వెళ్లడం, వెళ్లే ప్రయత్నం జరగడం తెలిసిందే. ఈ కోవలోనే రాపూరులో గల 500 ఏళ్లనాటి ప్రాచీన శ్రీ వెంకటేశ్వర స్వామికి చెందిన బలిపీఠం అపహరణకు గురైంది. ఇక్కడ గల ఈ ఆలయానికి ఎంతో ప్రాశస్తం వుంది. ఆలయంతోపాటు కోనేరు వుండేది. కాలక్రమంలో గుడి శిధిలావస్థకు చేరుకొని కూలిపోవడం, కోనేరు ఆక్రమణలకు గురికావడంతో కనుమరుగైపోయాయి. ఇక్కడి

గ్రామస్తుల్లో ఆందోళన

చెట్టు వద్ద మాత్రం వెంకటేశ్వర విగ్రహం, విగ్రహం ముందు బలిపీఠం, సగం విరిగిన ఏకశిలా ధ్వజస్తంభం మాత్రం వున్నాయి. ప్రజలు వీటికే పూజలు చేస్తుంటారు. అతి ప్రాచీనమైన సంపదగా గుర్తించిన పురావస్తుశాఖ ఈ ప్రాంతానికి వచ్చి అక్కడి విగ్రహాన్ని పరిశీలించి చారిత్రక విశిష్టత గల ఆలయంగా గుర్తించింది. ఈ పరిస్థితుల్లో దేవుని విగ్రహం ముందు వుండే బలిపీఠం మాయం కావడం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వాహనాల్లో వచ్చి బలిపీఠాన్ని తస్కరించుకొని వెళ్లినట్లు సమాచారం. ప్రాచీనమైన వెంకటేశ్వరస్వామి విగ్రహం వద్ద వుండే బలిపీఠం కన్పించకుండాపోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


● కావలిలో

ధాన్యం అమ్మకాలపై వివాదం!

రైతుల ధాన్యం ఏమైనట్లు?



కావలి రూరల్ మండలం మద్దూరుపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు విక్రయించిన ధాన్యంపై వివాదం నెలకొనడంతో పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఇక్కడ ఆశాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 500 మంది రైతులు ధాన్యాన్ని విక్రయించారు. వీరిలో ఐదు మంది రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించి లెక్కల్లో తేడాలు వచ్చాయి. ఈ రైతులు ధాన్యాన్ని విక్రయించినట్లు రశీదులు తీసుకొనగా ఆమేరకు ఐకెపి సిబ్బంది చెక్కులను పంపిణీ చేసింది. అయితే ఆ ధాన్యాన్ని తరలించిన మిల్లు యజమాని తనకు రైతుల వద్ద నుంచి ఎలాంటి ధాన్యం అందనందున ప్రభుత్వానికి బియ్యం లెవీ ఇవ్వనని చెప్పడంతో వివాదమేర్పడింది. దీనిపై పౌరసరఫరాలశాఖ మేనేజర్ ప్రసాద్ తదితరులు కావలి తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రైతులను విచారించగా ధాన్యం అమ్మినట్లు చెప్పి రశీదులు చూపగా, మిల్లు యజమాని ఆ ధాన్యం తనకందలేదన్నారు. రశీదులపై సంతకాలు చేసి ఉండడంపై అధికారులు ప్రశ్నించగా అవి తన సంతకాలు కావని మిల్లు యజమాని చెప్పడంతో గందరగోళం నెలకొనింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొంటూ పొంతనలేని సమాధానాలిస్తుండడంపై మేనేజర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు బయటపెట్టి లెక్కలు తేల్చకపోతే అందరిపై కేసుల పెడతామని హెచ్చరించారు.



చిలుక ద్వాదశినాడు పూజలతో పుణ్యం, పురుషార్థం!



కార్తీక మాసంలో వచ్చే పుణ్యప్రదమైన రోజు క్షీరాబ్ధి ద్వాదశి. ఆషాడ మాసంలో శుద్ధ ఏకాదశి రోజున క్షీరసాగరంలో శయనించిన విష్ణు భగవానుడు కార్తీక శుద్ధ ఏకాదశిరోజున నిద్ర మేల్కొంటాడని, ఆ ఏకాదశికి క్షీరాబ్ధి ఏకాదశి అని, మరుసటి రోజైన ద్వాదశిని క్షీరాబ్ధి ద్వాదశిగా జరుపుకొంటారు. కృతయుగంలో దూర్వాస మహర్షి శాపం కారణంగా సిరిసంపదలు, సామ్రాజ్యాన్ని కోల్పోయిన ఇంద్రాది దేవతలు పూర్వవైభవాన్ని పొందేందుకు శ్రీమహావిష్ణువు సూచనపై రాక్షసులతో కలసి అమృతం కోసం క్షీర సాగరాన్ని మధిస్తారు. అలా క్షీరాబ్ధిని కార్తీక శుద్ధ ద్వాదశి రోజునే చేశారు కాబట్టి ఈ ద్వాదశికి క్షీరాబ్ధి ద్వాదశి అనే పేరొచ్చింది. అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలికారు కాబట్టి చిలుక ద్వాదశి అని, సాగర మధనాన్ని చేసినందున మధన ద్వాదశి అని, క్షీర సాగరంలో వుండే శ్రీమన్నారాయణుడు ఈ ద్వాదశి నాడే శ్రీ మహాలక్ష్మి సమేతుడై బృందావనానికి వచ్చి భక్తులకు దర్శనమిచ్చినందున బృందావన ద్వాదశి అని పిలుస్తారు. దీనికే కైశిక ద్వాదని అని, హరిబోధిని ద్వాదశి, యోగీశ్వర ద్వాదశి అనే పేర్లు వాడుకలో వున్నాయి.

క్షీరసాగర మధనంలో జన్మించిన లక్ష్మీ దేవిని శ్రీమహావిష్ణువు దేవదానవుల సమక్షంలో వివాహమాడతాడు. అక్కడ నుండి లక్ష్మీ సమేతుడైన శ్రీహరి బ్రహ్మ, ఇంద్రాది దేవతలతో కలసి బృందావనానికి వెళ్లాడు. బృందావనం అంటే తులసివనం. ఆనాడు శ్రీమహావిష్ణువును తులసిని అర్చించి వారికి సకల శుభాలు కల్గుతాయని శాస్త్రాలు చెప్తున్నాయి. దశావతారాల్లోని శ్రీకృష్ణావతారంలో తులసికి, శ్రీకృష్ణునికి కార్తీక ద్వాదశి నాడు వివాహం జరిగిందని పురాణ కథనం. అందుకే తులసీ కళ్యాణానికి దేవ దీపావళి అనే పేరు వచ్చింది. దీపావళి రోజులాగే కార్తీక శుద్ధ ద్వాదశినాడు ఇంటి నిండా ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. అలాగే కార్తీక శుద్ధ ద్వాదశి నాడు చేపట్టే వ్రతాన్ని గురించి పురాణాలలో వివరించబడింది. పూర్వం ధర్మరాజు రాజ్యాన్ని పొగొట్టుకొని తమ్ములతో పాటు ద్వైతవనంలో వున్న సమయంలో అక్కడకు అనేక మంది రుషులు, మునులతో కలసి వ్యాసమహర్షి వచ్చారు. ధర్మరాజు ఆయనకు నమస్కరించి అన్ని కోరికలు సిద్ధించే ఉపాయం చెప్పమని కోరాడు. అందుకు వ్యాస భగవానుడు సమాధానమిస్తూ ధర్మరాజా పూర్వం నారదుడు బ్రహ్మని ఇదే ప్రశ్న అడిగితే ఆయన సర్వకామ ప్రదాలైన రెండు వ్రతాలు చెప్పాడు. అందులో ఒకటి క్షీరాబ్ధి ద్వాదశి వ్రతం అని చెప్పి వ్రత విధానాన్ని వివరించాడు. కార్తీక శుద్ధ ద్వాదశి నాడు శ్రీహరిని పూజించి, తులసి కథను విని భక్తితో దీపదానం చేస్తే సర్వ పాపాలు తొలగి, శుభాలు కలుగుతాయని చెప్తాడు. వ్రతం చేసేవారు కార్తీక శుద్ధ ఏకాదశినాడు ఉపవాసం చేసి ద్వాదశి పారణ చేసుకొని సాయంత్రం స్నానమాచరించి శుచిగా మారి తులసి కోట వద్ద ముగ్గులు పెట్టి అలంకరించాలి. తులసి చెట్టు మూలలో లక్ష్మీ సమేతుడైన విష్ణుమూర్తిని, తులసిని భక్తితో పూజించి కొబ్బరి, బెల్లం, ఖర్జూరం, అరటి పండ్లు నైవేద్యంగా పెట్టి, తాంబూల నీరాజనం చేయాలి. తులసీ సహిత లక్ష్మీనారాయణ మహత్యాన్ని, దీపదాన ఫలాన్ని శ్రద్ధగా తెలుసుకొని వ్రతాన్ని పూర్తి చేయాలి. అనంతరం తులసి కోట వద్ద దీపదానం చేయడం వలన అనంత పుణ్యాలు కల్గుతాయిని చెప్పారు.



షుగర్ వ్యాధిగ్రస్తులకు
సంజీవని జెరిటిన్-డి

సభలు - సమావేశాలు

సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వని సలహా బోర్డు సమావేశం

2లక్షలా 42వేల ఎకరాలకే సాగునీరు!



సాగునీటి సలహా బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి. జిల్లా కలెక్టర్ శ్రీధర్, జెసి లక్ష్మీకాంతం.

జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశం కనిపించడం లేదు. ఇటీవల నిర్వహించిన సాగునీటి సలహా బోర్డు సమావేశంలో ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి తీర్మానించడం జరిగింది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఐఎబి సమావేశంలో సోమశిల రిజర్వాయరులో ఆశించిన మేర నీటి నిల్వలు లేకపోవడంతో వరిపంట వేసుకునేందుకు అవసరమైన నీటిని విడుదల చేసేందుకు వీలు పడదని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల నీలం తుఫాను ప్రభావంతో కొంతమేర ఎగువ నుంచి సోమశిల రిజర్వాయర్‌కు నీరు చేరిందని వివరించారు. ఐఎబి సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆమోదించిన తీర్మానంపై రైతులు తీవ్ర ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గతనెల 14వ తేది నిర్వహించిన ఐఎబి సమావేశంలో నీటి పారుదలశాఖ అధికారులు నీటి విడుదలకు సంబంధించి రెండు ప్రతిపాదనలు చేశారు. మొదటి ప్రతిపాదనలో 2లక్షలా 42వేల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల చేయాలని పేర్కొన్నారు. రెండవ ప్రతిపాదనలో డిసెంబర్ నాటికి 22 టిఎంసిల నీరు చేరితే 5లక్షల ఎకరాల ఆయకట్టు సాగు చేయవచ్చునని వివరించారు. అధికారులు పేర్కొన్న విధంగా ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం లేకపోవడంతో సోమశిల రిజర్వాయరులో వివిధ మినహాయింపులకు పోను 21 టిఎంసిల నీటి లభ్యతతో తొలి ప్రతిపాదనలో సూచించిన రెండు లక్షలా 42వేల ఎకరాల సాగుకు నీటి విడుదల చేస్తారు.

జిల్లాలో పెన్నా డెల్టా, కనుపూరు, కావలి కాలువ, సంగం డెల్టా, వివిధ చెరువుల క్రింద కన్వర్షన్ చేయబడిన మొత్తం ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు వుంది. ప్రస్తుతం అధికారికంగా మూడు లక్షల ఎకరాలు, అనధికారికంగా మరో లక్ష ఎకరాల సాగుకు నీటి విడుదల చేస్తామని జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించడం విశేషం. అధికారులు సూచించిన విధంగా ఈ సీజన్‌లో సంగం, నెల్లూరు డెల్టా కాల్వల క్రింద లక్షా 69వేల 313 ఎకరాలు, కనుపూరు, కావలి, నార్త్‌ఫీడర్, సౌత్‌ఫీడర్ కాలువల క్రింద మరో 73వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అనధికారికంగా మరో లక్ష ఎకరాలకు అవసరమైన నీటిని ఎక్కడ నుంచి విడుదల చేస్తారన్నది సందేహంగా మారింది.

సోమశిల రిజర్వాయర్‌లో సాగుకు లభ్యమయ్యేది 21టిఎంసిల నీరు. ఒక టిఎంసితో 14వేల ఎకరాలు సాగుచేస్తే, రెండు లక్షల 94వేల ఎకరాలకు 21టిఎంసిల నీరు సరిపోతుంది.

2002-03 సంవత్సరంలో వర్షాలు కురవని కారణంగా అతి కష్టం మీద ఒక టిఎంసి నీటితో 12వేల నుంచి 13వేల ఎకరాలు సాగు చేయడం జరిగింది. అప్పట్లో ఆయకట్టు చాలా తక్కువగా వుండడంతో వున్న నీటితోనే రైతులు సర్దుబాటు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం అనధికారికంగా ఆయకట్టు పెరిగిపోతున్నా అధికారులు గుర్తించలేక పోతున్నారు. నీటిపారుదల శాఖ, వ్యవసాయశాఖ, రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఆయకట్టుకు సంబంధించి సమర్పించే వివరాలకు పొంతన వుండడం లేదు.

మొత్తం మీద ఈ సీజన్‌లో రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు అధికారులు మొండిచేయి చూపిస్తారు. వరి పంట సాగుకు నీటి విడుదల చేసిన అధికారులు, చివరి ఆయకట్టుకు అందుతుందా లేదా అన్న విషయాలను గతంలో కూడా పట్టించుకున్న దాఖలాల్లేవు. కాల్వలకు ఇంజన్లు అమర్చి నీటిని వాడుకునే విషయంలో రైతుల మధ్య వివాదాలు జరిగే ప్రమాదం వుంది.

● పచ్చి మతతత్వవాదిని

జాతీయవాదిని చేసిన మీడియా, రాజకీయ పార్టీలు!



శివసేన సేనాధిపతి బాలఠాకరే శివ సాయిజ్యం పొందాడు. బొంబాయి నగ రాన్ని తన ఆరాచకత్వంతో నలభై ఏళ్లకుపైగా గడ గడ వణికించిన ఒక మత తత్వవాది తన మరణం తోనూ ఆ మహా నగరం వెన్నులో చలి పుట్టించాడు. బాలఠాకరే మంత్రిగా పని చేయలేదు. ముఖ్యమం త్రిగా గద్దె ఎక్కలేదు. కనీసం ఎమ్పీనో ఎమ్మెల్యేనో కాదు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఒక ఎన్నిక లోనూ పోటీ చేయలేదు. ప్రజల మేలు కోసం ఒక్కటంటే ఒక్క చర్య తీసుకొన్న దాఖలా లేదు. ఒక్క టంటే ఒక్క మంచి పని చేశాడని చెప్పుకోవడానికి ఉదాహరణ లేదు. ఆయన జీవితమంతా ప్రజల మధ్య మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో విషం నింపడానికి, విద్వేషాలు రెచ్చగొట్టడానికి అంకితమైందనడం పచ్చి నిజం. కానీ ఆయనలో ఒక "జాతీయవాది" దర్శించాయి మన టీవీ ఛానళ్లు, ఇంగ్లీషు దినపత్రికలు. ఆయన శవ యాత్రను కొందరు అంబేద్కర్‌తో పోల్చి తమ చారిత్రక స్పృహను చాటుకొంటే, మరికొందరు టీవీ విలేకరులు ఏకంగా బాలగంగాధర్ తిలక్‌తో పోల్చి తమ జబ్బలు తామే చరచుకొన్నారు. భార తీయ సమాజంలో రోజురోజుకూ ప్రబలి పోతున్న భావదారిద్ర్యానికి, సంకుచిత మనస్తత్వానికి బాలఠాకరే అంతిమ యాత్ర ఒక దురదృష్టకరమైన సంకేతం. దేశ రాజకీయాలలో ఆదర్శ భావాలకు, సిద్ధాంత పరమైన ప్రజా జీవితానికి జవహర్‌లాల్ నెహ్రూ శకంతోనే స్వస్తి వాచకం పడింది. జాతి నేతలనే వారు ప్రజల బాగు కోసం కాక, పదవుల కోసం మాత్రమే రాజకీయాలు నెరపే విష సంస్కృ తికి బీజం వేసింది ఇందిరమ్మ. ఆ శూన్యంలో నుంచి పుట్టుకొచ్చిన అరాచకవాది బాలఠాకరే. నిజం చెప్పాలంటే అంతర్జాతీయ మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం, సిక్కుల ఆత్మగౌరవం కోసం తుపాకి పట్టిన జర్నయి సింగ్ బింద్రన్‌వాలే వంటి వారికి బాలఠాకరేకు పెద్దగా తేడా లేదు. వారు చేసింది, ఈయన చేసింది కూడా హింసను ప్రేరే పించడం మాత్రమే. స్థాయిలో తేడా తప్ప సిద్ధాం తంలో సారూప్యత ఒక్కటే. దావూద్‌ను ద్వేషించే భారతీయ సమాజం బాలఠాకరేను ఎందుకు ఆద రిస్తున్నదో అర్థం కాని విషయం.

కార్టూనిస్ట్‌గా జీవితం మొదలు...

బాలఠాకరే జీవితం ఒక ఇంగ్లీషు పత్రికలో కార్టూనిస్టుగా మొదలైంది. ప్రఖ్యాత సోషలిస్ట్ నేత జార్జి ఫెర్నాండెజ్ ఆ పత్రికలో ఆయనకు సహ విలేకరి కావడం గమనార్హం. కొంతకాలం తర్వాత "మార్మిక్" పేరుతో స్వంత పత్రిక పెట్టుకొన్నాడు. అయితే అది కూడా ఆయనకు సంతృప్తి ఇవ్వలేదు. 1966లో శివసేన పేరుతో రాజకీయ పార్టీ ప్రారం భించాడు. మహారాష్ట్ర మహారాష్ట్రీయుల కోసమే అన్నది ఆ పార్టీ నినాదం. బొంబాయి నగరంలోకి వలస వస్తున్న గుజరాతీలు, మార్వాడీలు, దక్షిణ భారతీయుల వల్ల స్థానిక యువకులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని, ఇట్లా వలస వచ్చిన వారిని బొంబాయి నుంచి తరిమి వేస్తే అందరికీ ఉద్యోగాలు దొరుకుతాయనే ప్రచారాన్ని చేపట్టడం ద్వారా నిరుద్యోగ యువకులను ఆకర్షిం చాడు బాలఠాకరే.

ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు

విచిత్రం ఏమిటంటే ఆయనకు ప్రజాస్వా మ్యం మీద లేశ మాత్రం కూడా నమ్మకం లేదు. తాను "లోక్‌సాహి కంటే శివసాయి"ని ఎక్కువగా నమ్ముతానని గొప్పగా చెప్పుకొనేవాడు. రెండవ ప్రపంచ యుద్ధానికి కారకుడైన జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ తనకు ఆరాధ్య నేత అని ప్రక టించుకొనేవాడు. ఎల్‌టిటిఇ ప్రభాకర్‌ను మెచ్చు కొనేవాడు.

శివసేన అనేది పేరుకు మాత్రమే ఒక రాజ కీయ పార్టీ తప్ప ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీకి వుండవలసిన కనీస లక్షణాలేవీ దానికి లేవు. ప్రజల కోసం అది రూపొందించిన పథకం ఒక్కటీ లేదు. కేవలం ప్రాంతీయతత్వం, మత విద్వేషాలు మాత్రమే దాని రాజకీయ ప్రణాళికలు. అందువల్లనే నలభైఏళ్ల పాటు మహారాష్ట్ర రాజకీ యాలను శాసించిన బాలఠాకరే అదే మహారాష్ట్రకు చేసిన మంచి పని అంటూ చెప్పుకోవడానికి ఏదీ కన్పించదు.

బెదరించి భయపెట్టే సిద్ధాంతం

ఆయన చేసిందల్లా బెదరించడం, భయ పెట్టడం మాత్రమే. బొంబాయి నగరంలో బాల ఠాకరే ఆశీర్వాదం తీసుకోకుండా ఒక్క పారిశ్రామిక వేత్త బ్రతికి బట్ట కట్ట లేడన్న అరాచక తత్వాన్ని మాత్రమే నిరూపించి చూపాడాయన. రతన్ టాటా నుంచి అమితాబ్ బచ్చన్ వరకు బొంబాయిలో నివసించే ప్రతి ప్రసిద్ధ వ్యక్తి బాలఠాకరేకు లోబడి బ్రతికినవారే. ఆ దారిలో నడవకుంటే బొంబా యిలో నిలవలేమన్న భయం అందరిలో నెల కొల్పాడు బాలఠాకరే. మొత్తం శివసేన పార్టీ ఆ మూసలోనే నడిచింది, నడుస్తున్నది. డాక్టర్లు, లాయర్లు, సినిమా నటులు, నిర్మాతలు, పరిశ్రమలు నిర్వహించేవారు, వ్యాపారం చేసుకొనేవారు, చివ రకు చిల్లర అంగళ్లు నడుపుకొనే వారు కూడా శివ సైనికులకు రౌడీ మామూలు చెల్లించడం ఒక ఆనవా యితీగా మారింది. ఆ దౌర్జన్యాన్ని నిరాటంకంగా కొనసాగించడం కోసం మునిసిపల్ రాజకీయాలను కేంద్రంగా మలచాడు బాలఠాకరే. కార్మిక సంఘా లను ఏర్పరిచాడు.

మతతత్వాన్ని తలకెత్తుకొన్న ఠాకరే!

1970 దశకం వరకు మహారాష్ట్ర మహారాష్ట్రీ యుల కోసమే అన్న నినాదం బాగా పని చేసింది. కానీ బొంబాయి విస్తృతి పెరిగిపోయి, వలస వచ్చిన వారి జనాభా స్థానికులకంటే అధికం కావడంతో దాన్ని పక్కనపెట్టి, మతతత్వాన్ని తలకెత్తుకొన్నాడు బాలఠాకరే. ముస్లిం మతాన్ని, ఆ మతస్తులను బహి రంగంగా ద్వేషించడం ద్వారా కొత్తతరం అరాచక వాదాన్ని ప్రేరేపించాడు. పాకిస్తాన్ క్రికెట్ ఆటగాళ్లను బొంబాయిలో అడుగు పెట్టనివ్వని ప్రకటించడం, క్రికెట్ మైదానాల పైకి దాడి చేసి ధ్వంసం చేయడం వంటి భయోత్పాత ఉదంతాలతో తన ఉనికిని కాపాడుకొన్నాడు. హిందు మతోద్ధారణ పేరుతో ప్రేమికుల దినాన్ని జరుపుకొనే యువతీ యువకులను వేధించడం ఈ అరాచక తత్వానికి పరాకాష్ఠ. దావూద్ ఇబ్రహీం ప్రేరేపిత బొంబాయి పేలుళ్ల తర్వాత బొం బాయి నగరంలో జరిగిన భయానక విధ్వంసం వెనుక బాలఠాకరే హస్తం వుందని అందరూ గుస గుసగా చెప్పుకొంటారు. కానీ ఆ మాట బయటకు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. బాలఠాకరే మీద కేసులు పెట్టడానికి కానీ, కనీసం విచారణ జరపడానికి కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాహసించలేక పోయా యంటే ఆయన సృష్టించిన భయం ఎంత దారుణ మైనదో అర్థం చేసుకోవచ్చు.

తన పార్టీకి పలుకుబడి తగ్గుతుందన్న సంకే తాలు వచ్చిన ప్రతి సందర్భంలోను ఏదో ఒక విధ్వంస

కొరవ 14వ పేజీలో



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ఇంట్లో చేసే శుభకార్య యత్నాలు ఫలిస్తాయి. స్వయం రంగాల వారికి మేలు జరుగుతుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోనివారు ఆర్థికంగా పుంజుకుంటారు. విద్యార్థులకు అనుకూలత. వ్యవసాయదారులు చేసే పనులలో వ్యక్తిత్వ లోపాలు లేకుండా జాగ్రత్తలు అవసరం. కళా, క్రీడా రంగాలవారు తమ వృత్తిలోపాలు సవరించుకోవాలి. రాజకీయులు గత విషయాలు నెమరువేసుకొంటూ బాధపడవద్దు.

వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

తలపెట్టిన పనులలో ఆటంకాలున్నా పూర్తి చేయగల్గుతారు. శత్రు, రుణ సమస్యలు మనస్సును బాధిస్తాయి. అవివాహితులకు వివాహ యోగం ఏర్పడగలదు. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆర్థిక ఇబ్బందులు. విద్యార్థులు తమ సమయాన్ని వృధా చేస్తారు. వ్యవసాయదారులు పనులు వేగవంతం చేస్తారు. కానీ ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. రాజకీయులకు కార్య సిద్ధి.

మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

చేసే పనులలో అలసత్వం, ధన వ్యయం. ఫలితం శూన్యం. నూతన కార్యక్రమాల వల్ల అధిక వ్యయం. మిత్రులు శత్రువులయ్యే అవకాశం వుంది. మీ వాగ్దాటిని అదుపులో వుంచడం మంచిది. వృత్తి, వ్యాపారాలలో స్వీయ కల్పనా శక్తిని పెంచాలనే తాపత్రయానికి వచ్చి నష్టపోతారు. విద్యార్థులకు విద్యావకాశాలు కుంటుపడతాయి. జ్ఞాపకశక్తి తగ్గే అవకాశం వుంది.

కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

ఈ రాశి వారు చేసే పనులలో, అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టాలి. కుటుంబ వ్యక్తుల మధ్య బేధాలు రాకుండా జాగ్రత్తలవసరం. దంపతుల మధ్య అన్యోన్యత మందగిస్తుంది. బంధుమిత్రుల ప్రేరణకు లోనుకావద్దు. పిత్రార్జిత విషయాలలో వివాదాలు రాగల సూచనలున్నాయి. అనవసరంగా ఇతరులను విమర్శించడం తగ్గించండి. విద్యార్థులకు ఆశాభంగం, వృధా ప్రయాణాలు.

సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

గతవారం వలె వుంటుంది. స్పెక్యులేషన్ రాణించదు. కోర్టు వ్యవహారాలు మనస్సు బాధపెడతాయి. అనవసర ప్రయాణాల వల్ల సమయం వృధా అవుతుంది. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆర్థికస్థితి సామాన్యం. వ్యవసాయదారుల పనులు వేగవంతమౌతాయి. కళా, క్రీడా రంగాలలోనివారు వృత్తిరీత్యా మృదుసంభాషణతో ఇతరులను ఆకట్టుకొంటారు. రాజకీయులు వాగ్ధోరణిలో అదుపు తప్పుతారు.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

కుటుంబ వ్యతిరేకతలపై వ్యధ చెందవద్దు. ఇంటాబయట విరోధాలు, సంఘర్షణలు తగ్గించండి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలో లోపాలు తెలుసుకొంటారు. శక్తికి మించిన కార్యాలలో తలదూర్చవద్దు. విద్యార్థులకు శుభకర వార్తాశ్రవణాలుంటాయి. వ్యవసాయదారులకు ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యపనులన్నీ పూర్తి చేస్తారు. కళా, క్రీడా రంగాలలోని వారికి ఆర్థికాదాయాలు బాగుంటాయి.

వారఫలాలు

తేది 24-11-2012 నుండి 30-11-2012 వరకు వృషభంలో గురు, కేతువులు; తులలో వక్రీ బుధ, శుక్ర, శనులు; వృశ్చికంలో రవి, రాహువులు; ధనుస్సులో కుజుడు; మీన, మేష, వృషభాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

24తేది బోధన ఏకాదశి, మొహరం పండుగ.
25తేది క్షీరాబ్ధి ద్వాదశి,
చాతుర్మాస వ్రత సమాప్తి.
26తేది వైకుంఠ చతుర్దశి.
27తేది కార్తీక వ్రతోద్యాపనం.
28తేది త్రిపుర పౌర్ణమి, జ్వాలాతోరణం,
కార్తీక దీపోత్సవం, గురునానక్ జయంతి.

నవంబర్ తిథులు

కార్తీక శుద్ధ

24	శని	ఏకాదశి	ప	10.37 గం.ల.వ
25	ఆది	ద్వాదశి	ప	12.37 గం.ల.వ
26	సోమ	త్రయోదశి	ప	02.58 గం.ల.వ
27	మంగళ	చతుర్దశి	సా	05.32 గం.ల.వ
28	బుధ	పౌర్ణమి	రా	08.14 గం.ల.వ

కార్తీక బహుళ

29	గురు	పాడ్యమి	రా	10.55 గం.ల.వ
30	శుక్ర	విదియ	రా	01.30 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.

తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

చేసే పనులలో క్లిష్టమైన వాటిని లేదా ప్రతిబంధక సమస్యలపై విజయం సాధిస్తారు. ఇతరులిచ్చిన హామీలు భంగం కాగలవు. సహాయం చేయడంలో అశ్రితపక్షపాతం చూపవద్దు. కోర్టు వ్యవహారాలు మనస్సును కలవరపెడతాయి. ఆస్తి లేదా ఇతర విషయాలపై స్థిర నిర్ణయాలు తీసుకొంటారు. వృత్తి, వ్యాపారులకు స్థిరాదాయాలుంటాయి. విద్యార్థులు వ్యక్తిగత ప్రతిష్టలకు పోవద్దు.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

దాంపత్యంలో మనస్పర్ధలు, సంతాన విషయంలో ఆందోళన, తొందరపాటు నిర్ణయాలు ఆందోళన కలిగిస్తాయి. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి కార్యసిద్ధి వుంటుంది. ఆస్తి వివాదంమై పితృ వర్గీయుల వారితో జరిగిన చర్చలు సఫలీకృతమవుతాయి. కష్టానికి తగిన ఫలితముంటుంది. విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టాలి. వ్యవసాయదారులకు అత్యంత అనుకూలమైన వారం.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఎదుటివారితో సంభాషించేటప్పుడు అనవసరవాదనలు, దూషించడం చేయవద్దు. ప్రతిష్టాత్మక నిర్ణయాల జోలికి పోవద్దు. నూతన అలంకార వస్తువులకై అధిక వ్యయం చేస్తారు. ప్రతి విషయంలో ఆచితూచి అడుగేయాలి. వృత్తి, వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగుల పరిస్థితి ఆశాజనకం. కళా, క్రీడా రంగాల వారు అనవసర నిందలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

చేస్తున్న పనులలో కొంత వ్యతిరేకతున్నా తెలివిగా సమస్యలను పరిష్కరించుకొంటారు. గౌరవ మర్యాదలకు భంగం కాగల సూచనుంది. నూతన గృహనిర్మాణాలు కుంటుపడతాయి. వృత్తి, వ్యాపారాలలో నూతన ఆలోచనలు లాభిస్తాయి. విద్యార్థులు చదువులో ముందుంటారు. కోర్టు వ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. వ్యవసాయదారులకు పనులు జోరుగా వున్నా ఆర్థికమాంద్యం వుంటుంది.

కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

చేసే పనులలో కొన్ని సమస్యలను తగ్గించుకొంటారు. పనుల ఒత్తిడిచే శరీరశ్రమ వున్నప్పటికీ తగిన ఫలితం వుంటుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగులకు పై అధికారుల అండదండలుంటాయి. ఆర్థికమాంద్యం తగ్గుతుంది. విద్యార్థుల అంచనాలు తారుమారౌతాయి. స్థానచలనాలుండవచ్చు. కళా, క్రీడా రంగాలలోని వారి పరిస్థితులు అనుకూలించవు. రాజకీయులు వాగ్ధోరణిని అదుపులో వుంచుకోవాలి.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

స్పెక్యులేషన్ లాభించదు. వ్యయప్రయాసలతో దూర ప్రయాణాలు చేయవద్దు. ఆగిన పనులు క్రమంగా తిరిగి ప్రారంభమయ్యి కార్యరూపం దాలుస్తాయి. దైవకార్యాచరణపై మొగ్గు చూపుతారు. వృత్తి, వ్యాపారాలలోని వారికి ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. విద్యార్థులు తగిన సమయ స్ఫూర్తిని ప్రదర్శించలేరు. వ్యవసాయదారులు రుణాన్వేషణలో తలమునకలై వుంటారు.

ప్రాప్తం లేనప్పుడు పరమేశ్వరుడ్ని సైతం గుర్తించలేరు!

వి.అరుణారెడ్డి *నెల్లూరు*

** ప్రాప్తం లేనపుడు భగవంతుణ్ని సైతం గుర్తించలేరని ఒక వాస్తు గ్రంథంలో చదివాను.*

'ధర్మసింధు' వాస్తు గ్రంథంలో మూర్ఖులు ప్రాప్తాన్ని ఎలా పోగొట్టుకుంటారో చెప్పే శ్లోకం మీరు చదివి ఉంటారు. గుర్తించకపోవడం కాదు. నిందలు కూడా మూటగట్టుకుంటారని వివరిస్తున్నది.

డాక్టర్ వేలాయుధం *చెన్నై*

** వాస్తుకేదార గ్రంథంలో యముడికి ఒక గ్రహానికీ ముడి పెట్టారట నిజమేనా?*

ప్లూటో గ్రహాన్ని యమ గ్రహంగా ఆధునిక శాస్త్రవేత్తలు గుర్తించారు. యురేనస్(వరుణుడు), నెప్ట్యూన్(ఇంద్రుడు) అని ప్రచారంలో ఉన్నాయి.

సి.పురంధేశ్వరి *తిరుపతి*

** శంఖుస్థాపన మధ్యలోనా? ఈశాన్యం లోనా?*

శంఖుస్థాపన నాభి(మధ్య) భాగంలో అని వాస్తు చూడామణి, ఈశాన్యంలోనని విశ్వామిత్ర వాస్తు చెబుతున్నాయి. ఈశాన్యం శ్రేష్ఠమని గ్రంథాలు చెబుతున్నాయి.

ఎం.ఉమాదేవి *కర్నూలు*

** ఆగ్నేయం లేదా వాయువ్యం పల్లమైతే ఫలితాలెలా ఉంటాయి?*

స్థిరాస్థులు కోల్పోవుట, అప్పులు, అనారోగ్యం వంటి సమస్యలు ఏర్పడుతాయి.

డి.శంకరరెడ్డి *నారాయణరెడ్డిపేట*

** నాకు 'పుష్యరాగం' బాగా పని చేస్తుందా?*

మీకు కుజుడు, చంద్రుడి ప్రభావాలున్నాయి. పగడం, ముత్యం ధరించాలి.

ఎన్.భార్గవి *మదనపల్లె*

** శంఖుస్థాపన కోసం 'శంఖువు'ను ఏ కొయ్యతో తయారు చేయాలి?*

సంద్రుదారువు శ్రేష్ఠం. రావి, మర్రి, జువ్వి, టేకు, వేప దారువు(కొయ్య) వాడవచ్చునని వశిష్ఠ సంహిత పేర్కొంటున్నది.

సి.కె.అనితానాయుడు *చిత్తూరు*

** అతను దారి తప్పాడు. అతన్ని చెప్పు చేతల్లో పెట్టుకోగలనా?*

అతని హస్త రేఖల్ని గమనించి, నవరత్న ధారణ చేయించి, నిర్దుష్టమైన యంత్ర ప్రతిష్ట చేస్తే అతని ప్రవర్తనలో మార్పు వస్తుంది.

ఇ.చంద్రశేఖర్ *నాయుడుపేట*

** స్థలం చతురస్రం, దీర్ఘ చతురస్రం లేకపోతే ఏమౌతుంది?*

కుంభ(కుండ) వృత్యాకారం(గుండ్రం), విషమ (పద్ధతిలేని), శకటం(బండి) ఆకారపు స్థలాలలో నిత్యం దారిద్ర్యం, అనారోగ్యం, అవమానాలు తప్పవు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

వి.కరుణాకర్ *ఉదయగిరి*

** వాస్తు పురుషుడు తన దిశలను మార్చుకొంటాడా?*

'వాస్తుకేదారం'లో వాస్తు పురుషుడు ప్రతి మూడు నెలలకొకసారి తన గతిని మారుస్తాడని చెప్పబడింది. భాద్రపద మాసంలో తూర్పు శిరస్సు, పశ్చిమం పాదములు వాస్తు పురుషుని స్థితి గతి.

డి.సూర్యం *అనంతపురం*

** గృహ నిర్మాణ విధివిధానాల్ని గురించి చెప్పండి?*

నైరుతి, ఆగ్నేయాల నుంచి గృహ నిర్మాణం ప్రారంభించి, వాయువ్యం, ఈశాన్యాలలో గృహ నిర్మాణం చేయాలి.

డాక్టర్ రామారావు *బాపట్ల*

** 'ఆగ్నేయం' సైన్సు థియరీని గురించి చెబుతారా?*

ఈశాన్య నైరుతి నిర్మాణాలు శాస్త్రం ప్రకారం జరిగితే, గాలుల ఒత్తిడి ఆగ్నేయం, వాయువ్యాలపై ఉంటుంది. అందువల్ల వంట గదిని ఈ ప్రాంతాల్లో నిర్ధారించారు. ఈ కారణంగా 'కాలుష్యాలు' బహిష్కరించ బడుతాయి.

వి.మాధవి *చెన్నై*

** ఏ పని ప్రారంభించినా పూర్తి కావడంలేదు. బాబు ఇంకా స్థిరపడలేదు. ప్లాను పంపిస్తున్నాను.*

ఆగ్నేయం స్థలం పెరగడం, గృహ నిర్మాణంలో పారదర్శకత లేకపోవడం, నిర్మాణంలో ఈశాన్య కోణ వేధ మీ సమస్యలకి కారణం. నేరుగా చూస్తేగానీ పూర్తి సలహా ఇవ్వలేం.

నీలం తుఫాను నష్టాలను చూడరేమి?

నీలం తుఫాను మూలంగా వరి పంటకు నష్టం జరగకపోయినా మెట్ట ప్రాంతాల్లో మినుము, కంది, నిమ్మ చెట్లకు మాత్రం నష్టం వాటిల్లింది. డెల్టా ప్రాంతంలో అరటి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. సమగ్ర సర్వే చేస్తేగానీ నష్టాల వివరాలు తెలియవు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల సంభవించిన 'నీలం' తుఫాను ప్రభావంతో జిల్లాలో వివిధ రకాల పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది. రైతులకు జరిగిన పంట నష్టాలపై సంబంధిత శాఖలకు చెందిన అధికారులు సర్వే జరిపి ప్రభుత్వానికి పంపాల్సి వుంటుంది. అధికారులు సర్వే జరిపి గుర్తించి పంట నష్టంపై ప్రభుత్వం రైతులకు పరిహారం అందించే అవకాశం వుంటుంది. పంట నష్టం జరిగి దాదాపు 20 రోజులు కావస్తున్నా అధికారులు మాత్రం ఏ కారణం చేతనో సర్వే చేసేందుకు ముందుకు కదలడం లేదు. దీంతో నష్టపోయిన రైతాంగం మరింత అప్పుల వూబిలో కూరుకుపోయే ప్రమాదం వుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి సైతం "నీలం తుఫాను" నష్టాలపై త్వరితగతిన సర్వే చేయాలని ఆదేశించారు.

గతంలో తూతూ మంత్రంగా సర్వే జరిపి నష్టం జరిగిన జరగకపోయినా అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేవారు. అయితే ఈ దఫా నష్టాలపై కొన్ని మార్గదర్శకాలు జారీచేసి ఆ విధంగా సర్వే చేయాలని ఉత్తర్వులు జారీ కావడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. ఏ పంటకు నష్టం వాటిల్లింది? గ్రామం పేరు, రైతు పేరు, సర్వే నెంబర్‌తో సహా ఎంతమేరకు నష్టం వాటిల్లిందన్న పూర్తి సమాచారాన్ని నివేదికలో పొందుపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటివరకు సంభవించిన తుఫాన్లు, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాలపై సర్వే జరిపిన అధికారులు ప్రస్తుతం నీలం తుఫాను నష్టాలపై సర్వే చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. భారీవర్షాలు, తుఫాన్లు సంభవించినప్పుడల్లా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు, ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది.

మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించకుంటే ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం వుంది. సర్వే నెంబర్ల వారీగా నష్టాలను అంచనా వేయాలంటే రెవెన్యూశాఖ సహకారం తీసుకోక తప్పదు. భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు గ్రామ రెవెన్యూ అధికారుల వద్ద వుంటాయి. విఆర్వోలు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులతో కలసి గ్రామాల్లో పర్యటించాలి. ఈ విషయమై రెవెన్యూశాఖ నుంచి అవసరమైన సహకారం లభించక పోవడంతో పంటనష్టాలపై సర్వే చేయలేకపోతున్నట్లు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో నీలం తుఫాను కారణంగా వరి పంటకు నష్టం జరగలేదు. ఎందుకంటే ముందుగా వర్షాలు కురవకపోవడంతో రైతులు వరినాట్లు వేసుకోలేకపోయారు. దీంతో నష్టాల నుంచి రైతులు ఊరట చెందారని భావించాలి. ప్రధానంగా అరటి, మినుము, కంది, వేరుశనగ పంటలకు తీవ్రనష్టం జరిగింది.


మెట్టప్రాంతాల్లో మినుము, కంది, నిమ్మ చెట్లకు నష్టం జరగ్గా, డెల్టా ప్రాంతంలో అరటి, వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లింది. అధికారుల అంచనాల ప్రకారం వెయ్యి ఎకరాల్లో వేసిన పంటలు దెబ్బతిన్నాయని అంటున్నారు. సమగ్రమైన సర్వే చేస్తే పూర్తి సమాచారం వెలువడే అవకాశం వుంది. సర్వే చేసేందుకు విఆర్వోలు పలు కుంటిసాకులు చెబుతున్నట్లు సమాచారం. సర్వే నెంబర్లను తప్పని సరిగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సర్వే ప్రక్రియ ప్రారంభం కాకుండా పోయింది. అధికారులు అవలంభిస్తున్న విధానాల కారణంగా మధ్యలో రైతులు ఇబ్బందిపడక తప్పదం లేదు. ప్రాధమిక అంచనాల ప్రకారం అన్ని శాఖల నష్టాలు 10కోట్లుగా నిర్ణయించారు.

రైతులు నష్టపోకుండా సంబంధింత శాఖలకు చెందిన అధికారులు ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం సర్వే చేయాల్సిన అవసరం వుంది. జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి "నీలం తుఫాను" నష్టాలపై అధికారులతో సర్వే చేయిస్తే బాగుంటుంది.

నేరాల పురి

నెల్లూరులో పెరిగిన నేరాలు - ఘోరాలు!

"ప్రశాంతనగరంగా పేరుబడ్డ నెల్లూరులో ఇటీవల చోరీలు పెరిగాయి. ఇవి చాలవన్నట్లు ఆస్తులు, నగదు, నగల కోసం హత్యలు వరుసగా జరిగి సింహపురి నేరాల నగరి అయ్యింది."



కొత్తూరు అడవుల్లో హత్యకు గురైన తస్లీం మృతదేహం వద్ద పోలీసుల పరిశీలన.

జిల్లాలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. ఒకప్రక్క కరుడు కట్టిన నేరస్తులు భారీ చోరీలకు పాల్పడుతుంటే, మరోప్రక్క ఆస్తులు, నగదు, నగల కోసం హత్యలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించడం పోలీస్ యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా మారింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నా పోలీసులు ఏం చేయలేని పరిస్థితి. చట్టం, న్యాయస్థానాలంటే ఏమాత్రం భయం, గౌరవం లేకుండా పోయింది. డబ్బు, అధికారం వుంటే ఎంతటి కేసునుంచైనా బయటపడవచ్చునన్న ధీమా పెరిగింది.

గతంలో వివిధ హత్యకేసులు, అత్యాచారాల కేసుల్లో ముద్దాయిలుగా వున్న వారికి కఠిన శిక్షలు పడకపోవడంతో, ఇతరులు కూడా నేరాలకు పాల్పడేందుకు అవకాశం ఏర్పడినట్లు కనిపిస్తుంది. కేసులు నమోదు చేసిన అనంతరం అరెస్టు చేసి జైలుకు పంపి చేతులు దులుపుకుంటున్నారు పోలీసులు. కేసు పూర్వాపరాలపై సమగ్రంగా విచారణ జరిపి చార్జిషీటు దాఖలు చేయడం లేదన్న విమర్శలు వున్నాయి. కేసు విచారణ సమయంలో దర్యాప్తు చేసే వారు బదలీ కావడం, సంవత్సరాల తరబడి కోర్టుల్లో కేసు నడవడం వంటి కారణాలతో బాధితులు సైతం అసహనం వ్యక్తం చేస్తూ కోర్టుకు హాజరు కాలేని పరిస్థితులు వున్నాయి.

గడిచిన రెండు నెలల కాలంలో జిల్లాలో ఆరు హత్యలు జరిగాయి. గూడూరు డివిజన్‌లో రెండు, నెల్లూరు డివిజన్‌లో మూడు, కావలి డివిజన్‌లో రెండు కేసులు నమోదు కాబడ్డాయి. వీటిలో కేవలం ఆస్తి, నగదు కోసం గూడూరు పట్టణంలో కన్న తండ్రినే తనయుడు హత్య చేయగా, నెల్లూరు నగరంలో 12 సంవత్సరాల బాలుడిని రక్త సంబంధీకులే కిరాతకంగా హతమార్చారు. నెల్లూరు నగరానికి చెందిన ఒక మహిళను కేవలం నగల కోసం నమ్మకంగా వున్న స్నేహితులే నరసింహకొండకు తీసుకెళ్లి బండరాయితో కొట్టి చంపారు. అలాగే భూ వివాదంలో పెళ్లకూరు పోలీసుస్టేషన్ పరిధిలో పట్టపగలే ఓ వ్యక్తి హత్యకు గురైనాడు. ఇవన్నీ కేవలం ఉదాహరణలు మాత్రమే.

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలపై పలు కేసులు నమోదు కాబడుతున్నాయి. ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో కేసులు నమోదు చేసుకుంటున్న పోలీసులు నేరస్తులకు శిక్షలు పడేందుకు సరైన సాక్ష్యాలను ప్రవేశపెట్టలేక పోతున్నారన్న ఆరోపణలు వున్నాయి. రాజకీయ అండదండలున్న నేరస్తులు బాధితులను సాక్షులను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేయడంతోపాటు బెదిరింపులకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం వున్నాయి. ప్రతి నెల జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే నేర సమీక్షల్లో కూడా కేసుల పురోగతిపై చర్చిస్తున్న క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన విధంగా సిబ్బంది పని చేయడం లేదు.

హత్యలు, చోరీలు, అఘాయిత్యాలు పెరుగుతుండడంతో జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులు వున్నాయి. పోలీస్ యంత్రాంగాన్ని గాడిలో పెట్టడంతోపాటు నమోదు చేయబడిన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా కృషి చేయకుంటే మరిన్ని నేరాలు జరిగే ప్రమాదం వుంది.



బూతుల బుంగ బస్‌స్టాప్

LOVERS ADDA

✍ అల్లూరు రహీం

చిత్ర సమీక్ష

ఈ తరం యువతీ యువకుల్లో బలహీనతలను ఎత్తిచూపుతూ విడుదలైన ఒక రొమాంటిక్ క్రైమ్ స్టోరీ, ఈ రోజుల్లో చిత్రాలు విజయవంతం అయ్యాయి. నిర్మాతలకు కాసుల వర్షం కురి పించాయి. ఈ చిత్రాల స్ఫూర్తితో ఇంకొందరు నిర్మాతలు ఇదే బాట పట్టారు. అలా తయారైన చిత్రమే బస్‌స్టాప్. ఈ చిత్రానికి సీనియర్ నిర్మాత బెల్లంకొండ సురేష్ పెట్టుబడి పెట్టగా కొత్తగా పరిశ్రమకు వచ్చి బూతు చిత్రాల స్పెషలిస్ట్‌గా పేరుగాంచిన మారుతి కథ, స్క్రీన్‌ప్లే, మాటలతోపాటు దర్శకత్వ బాధ్యతలు కూడా నెరిపాడు. సినిమా వ్యాపారం. వ్యభిచారం కాదు. శృంగారం సృష్టిధర్మం దాన్ని వెండి తెరపై చూపిస్తే తప్పేముందన్న ధైర్యంతో తెరకెక్కిన చిత్రం బస్‌స్టాప్. ఈ చిత్రం ప్రారంభం నుంచి ముగిసే వరకు దరిదాపులు అన్ని పాత్రలు వక్రంగా మాట్లాడుతుంటాయి. చేపల మార్కెట్‌ను మించిన బూతుమాటలు స్టీరియోఫోనిక్ సౌండ్‌లో సినిమాహాల్‌లో ఉన్న వారికి వినిపిస్తుంటాయి. కాని సెన్సార్‌బోర్డు అధికారిణి, ఈ సినిమాను చూసిన సభ్యులకు గాని ఇవి ఎందుకు వినిపించలేదో అర్థమే కాదు. ఈ సినిమాలో క్లాస్‌రూమ్‌లో సెల్‌ఫోన్ ద్వారా విద్యార్థినీ, విద్యార్థులు చివరకు లెక్చరర్ కూడా బూతు సినిమా చూస్తారు. ఒక అమ్మాయి ఓ అబ్బాయిని ఫోనులో శృంగారానికి ప్రేరేపించి కామదాహం తీర్చింది చాలక ల్యాప్‌టాప్ ద్వారా సర్వం చూపించేస్తుంది. మరో అమ్మాయి తనను తాను అర్పించుకోను ప్రియుడి రూమ్‌కు వెళ్తుంది. ఓ అబ్బాయి లవర్ కోసం ఇంట్లో వస్తువులన్నీ దొంగ లించి బయట కుదువ బెట్టేస్తాడు. ఇంకొకడు తన లవర్ ఒక చిన్న పాపకు ముద్దులు పెడితే తనకు సైతం అవి కావాలని ఆ పాప వెనుక పరుగెడు తాడు.

అమ్మాయిలు కుర్‌కురేను చూపిస్తూ మెలికలు తిరిగి ఉంది ఎవరిదం టారు. ఒకసారి కాల్... ఎత్తితే, సిన్సియర్‌గా లవ్‌చేసే వాడికన్నా సైలెంట్‌గా కడుపు చేసే వాళ్లను ఆడపిల్లలు నమ్ముతారన్న పచ్చి డైలాగ్ ఈ సినిమాలో ఉంది. ఈతరహాలోనే బ్యాటు ఉంది కదా అని భుజాన వేసుకొని వెళ్లి పోయి... కనిపించిన ప్రతి పిచ్‌పై ఆడేశావు. ఇప్పుడేమైంది? బ్యాటు విరిగి పిడి చేతికొచ్చిందంటాడు ఓ తండ్రి తన కొడుకుతో. ఇప్పటివరకు ఎక్కడ పెట్టుకొన్నావు నీసెల్లు... నేను మళ్లీ చేసేంతవరకు చేతిలో పెట్టుకొని కూర్చో నీ సెల్లు అంటూ ఒక అమ్మాయి తన ప్రియుడితో అనే లెక్కలేనన్ని ద్వంద్వార్థపు మాటలు జనానికి అర్థం కావని నటీనటుల హావభావాలు జోడించాడు. తన కుమార్తెకు ల్యాప్‌టాప్‌ను కొనిచ్చిన తండ్రి ఇక నీయిష్టం వచ్చినట్లు చూసుకో, టకటక డౌన్‌లోడ్ చేసుకో... ఇష్టమొచ్చినంత సేపు కొట్టుకో అని ఎందుకు చెబుతాడు మారుతీ? ఇప్పుడు కాలే జీలకు అమ్మాయి, అబ్బాయిలు బాగా చదువుకోను వెళ్తున్నారు. అటువంటివారిని ప్రక్కతోవ పట్టించే చిత్రమే ఈ బస్‌స్టాప్. అసలిప్పుడు బస్‌స్టాప్ ప్రేమలు లేవు. చాలా మంది విద్యార్థినీ విద్యార్థులు టూవీలర్స్‌లోనే కాలేజిలకు వెళ్తున్నారు. ప్రేమంటే గతంలోలా ఇప్పుడూ త్యాగం చేసేవాళ్లు ఎందరో?? ఇవన్నీ భూస్థాపితం చేసి బూతుల బుంగలా బస్‌స్టాప్‌ను కాసుల గలగల కోసం మలచడం బాగోలేదు.

చిత్ర కథలోనికి వెళ్తే శ్రీను (ప్రిన్స్) ముద్దు(సాయి కుమార్), ఖన్నా (ఖన్నా), సాండి(సాండి) రాజు (గోపాల్‌సాయి), కాలేజి విద్యార్థులు. వీరిలో శ్రీను, శైలు (శ్రీదివ్య)ను ప్రేమిస్తుంటాడు. సీమ (పంపన) ఖన్నా, రాజులను లైన్‌లో పెడుతుంది. టుమ్‌రీ(హానిక) వాళ్ల నాన్న రావు(రావు రమేష్) సాండిని ప్రేమించమంటాడు. ముద్ద అయితే ఒక్కో సిమ్ కార్డుతో ఒక్కో అమ్మాయి జీవితంతో ఆట ఆడేస్తాడు. వీరి ప్రేమల్లో దిగజారుడుతనం ఉంటుంది. దీనివల్ల అందరూ సమస్యల్లో ఇరుక్కొంటారు. చివరన ఒక నీతి చెప్పాలి కాబట్టి కొన్ని జంటలను దర్శకుడు కలిపాడు. ఇంకొందరిలోనూ మార్పు వచ్చిందని చూపించడంతో సినిమా ముగుస్తుంది. తమ పిల్లలను బస్‌స్టాప్‌కు పోకుండా పెద్దలు జాగ్రత్త పడాల్సినంత గలీజు చిత్రమిది.



త్రిభాషా చిత్రంలో మహేష్‌బాబు

హీరో మహేష్‌బాబు డైరీ వచ్చే ఏడాదికి కూడా పూర్తిగా నిండిపోయింది. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా షూటింగ్ ముగింపు దశలోకి రాగా, సుకుమార్ దర్శకత్వంలో తయారయ్యే చిత్రంలో నటించడానికి మహేష్‌బాబు ఒప్పుకొన్నారు. ఇది కాగానే వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తీసే హే కృష్ణాముకుందా మురారిలో నటించాల్సి ఉంది. మహేష్‌బాబు కోసం ప్రత్యేక కథ వ్రాయను పూరి జగన్నాధ్ బ్యాంకాక్ బయలుదేరి వెళ్లాడు. ఇవన్నీ గాక ఏమాయ చేసావే ఫేం గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో 2013లో మహేష్‌బాబు ఓ సినిమాల్లో నటించను ఒప్పుకొన్నాడని ఇటు హైదరాబాద్, అటు చెన్నై సినీవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో చేయాలన్నది గౌతమ్‌మీనన్ ఉద్దేశ్యమట. దీనికి మహేష్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడట. ఈ చిత్రంతో మహేష్‌బాబు స్టార్‌డమ్ ఇంకా పెరిగిపోతుందనే వ్యాఖ్యలు ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తున్నాయి.

వర్మ చేతిలో యాసిడ్‌దాడి చిత్రం




ప్రేమోన్మాదం పేరుతో బలైపోతున్న యువతుల జీవితాలను చూస్తూనే ఉన్నాం. ప్రేమించడం... ఆ ప్రేమను కాదంటే యాసిడ్ పోసి తమ కిరాతకాన్ని చూపిస్తున్న నరరూప రాక్షసుల తాకిడి రోజురోజుకీ ఎక్కువైపోతోంది. యాసిడ్ దాడికి బలైన ఓ అమ్మాయి జీవితాన్ని వర్మ ఇప్పుడు వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ అమ్మాయి ఎవరో కాదు. బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ సోదరి. కొన్నాళ్ల క్రితం కంగనా సోదరి యాసిడ్ దాడికి గురైంది. ఓ ప్రేమోన్మాది ఆమెపై యాసిడ్ పోసి పరారయ్యాడు. ఆ తర్వాత ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ చేశారు. ఆరోగ్యం కుదుటబడింది. ఆ అమ్మాయి అనుభవాలను వర్మ ఇప్పుడు తెరపైకి తీసుకొస్తున్నాడు. కథా రచన విషయంలో వర్మకు కంగనా సహాయపడుతోందట. ఈ సినిమా ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందో చూడాలి.



కొత్త ఖైదీ ఎవరు?

పాత చిత్రాలకు కొత్త రంగులద్ది రీమేక్ చేసే సంస్కృతి ఇప్పటివరకు బాలీ వుడ్‌కే పరిమితమైంది. క్రమంగా ఆ విధానం టాలీవుడ్‌లోకి ప్రవేశించబోతోంది. 1983లో చిరంజీవి హీరోగా విడుదలైన 'ఖైదీ' చిత్రం రీమేక్ హక్కుల్ని ఇటీవల తాండ్ర రమేష్ పొందారు. త్వరలో తాను తీసే ఈ చిత్రంలో హీరో, దర్శ కుడి వివరాలు వెల్లడిస్తానన్నారు రమేష్. ఈలోపే ఫిల్మ్‌నగర్‌లో ఖైదీ రీమేక్ విషయం మీద ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.. ఈ సినిమాను మహేష్‌బాబుతో నిర్మిస్తారని, పూరిజగన్నాధ్ దర్శకు డంటున్నారు. కాదు ప్రభాస్, అల్లు అర్జున్ హీరో అంటున్నారు ఇంకొందరు. కేంద్రమంత్రి చిరంజీవి మాత్రం ఇటీవల హైదరా బాద్‌లో 'ఖైదీ' రీమేక్ చిత్రంలో రామ్‌చరణ్ అయితే బాగుంటా డని బాహాటంగా చెప్పారు. మార్కెట్ వ్యూహాలకు తగ్గట్టు చూసుకొంటే ఖైదీలో 'సూర్యం' పాత్ర రామ్‌చర ణ్‌నే వరిస్తుందని, గబ్బరిసింగ్ ఫేం హరీష్ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తాడని మరోవర్గ కథనం. మొత్తం మీద 'ఖైదీ' రీమేక్ కబుర్లకు కొద్ది వారాల్లో తెరపడే అవకాశం ఉంది.

ఓ మైగాడ్‌లో పవన్‌కళ్యాణ్



హిందీలో అక్షయ్‌కుమార్ నటించి నిర్మించిన చిత్రం 'ఓ మైగాడ్' ఇం దులో అక్షయ్‌కుమార్ కథానాయకుడేమి కాదు. ఓ ప్రత్యేక పాత్ర. అంటే దేవుడు పాత్ర అన్నమాట. ఈ చిత్రంలో ప్రధానపాత్రను పరేష్‌రావెల్ పోషిం చాడు. 'ఓమైగాడ్' విడుదలైనప్పుడు డివైడ్ టాక్ వచ్చింది. క్రమంగా పుంజుకొని భారీ వసూళ్లు దక్కించుకొంది. ఈ సినిమాను త్వరలో తెలుగులో రీమేక్ చేయబోతున్నారు. ఓ దశలో పవన్‌కళ్యాణ్ నటిస్తా డనీ, ఆయన సన్నిహితుడు శరత్‌మరార్ నిర్మిస్తారనే ప్రచారం సాగింది. ఈ విషయంలో ఏది నిజమనేది కొన్నాళ్లలో తేలుతుంది.



దర్శకుని తిరుగుళ్లు?

తెలుగు పరిశ్రమలోని దర్శకులకు బుద్ధి మంతులుగా పేరుంది. దీనివల్లే వీరిపై గాసి ప్పులు తక్కువ. పూలరంగడు దర్శకుడు వీర భద్రమ్, ప్రముఖ యాంకర్ ఉదయభానుతో కలసి తిరుగుతున్నాడని ఫిల్మ్‌నగర్ కోడై కూస్తుంది. ఇదే విషయమై వీరభద్రమ్‌ను అడిగితే అదేం లేదు, నా కొంప కొల్లేరు చేయకండి, ఏదో గుట్టుగా కాపురం చేసుకొంటున్నానన్నాడు. ఉదయ భానును ఈ గుట్టు గూర్చి అడిగితే కస్సు బుస్సుమంటుంది.

● ప్రభుత్వ

పాఠశాలల్లో టీచర్ల కొరత!

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయక పోవడంతో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం డెప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను హైస్కూళ్లలో నియమించుకోమని ఉత్తర్వులు ఇచ్చినా జిల్లా విద్యాశాఖ అధికారికి ఆ ఉత్తర్వులు అమలు పరిచే తీరిక, శ్రద్ధ లేకపోవడంతో జిల్లావ్యాప్తంగా పలు స్కూళ్లలో దాదాపు 400లకు పైగా ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ప్రధానంగా హైస్కూళ్లలో స్కూలు అసిస్టెంట్లు లేకపోవడంతో గణితం, సైన్సు తదితర ముఖ్యమైన సబ్జెక్టులు బోధించే టీచర్లు కరువయ్యారు. పాఠశాలలు తెరచి ఐదు నెలలు గడుస్తున్నా, ఆరు నెలల పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇంకా సబ్జెక్టు టీచర్లు లేకపోవడం, ఆ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పదవ తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డిఎస్సీ లేకపోవడం, ఉపాధ్యాయుల బదలీలు జరగడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. దీనికి ప్రత్యామ్నాయంగా విద్యావాలంటీర్లను గానీ, సమీప పాఠశాలల నుంచి స్కూలు అసిస్టెంట్లనుగానీ డెప్యుటేషన్‌పై నియమించుకోవచ్చని ఆదేశాలిచ్చినా జిల్లాలో ఇది అమలు కాకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వాకాడు, చిట్టమూరు, వరికుంటపాడు, కలిగిరి, డక్కిలి తదితర ప్రాంతాల్లో గల పాఠశాలల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ప్రభుత్వం ఆదేశించినా విద్యాశాఖాధికారి దాని గురించి పట్టించుకోకపోవడంతో విద్యావాలంటీర్ల నియామకం జరగక, సబ్జెక్టు టీచర్లు లేక విద్యాబోధన సరిగా జరగక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి రాత్రి పదకొండుమంది మండల విద్యాశాఖాధికారులను మార్చి తనకు నచ్చిన వారిని నియమించుకొన్న జిల్లా విద్యాశాఖాధికారి వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, విద్యావాలంటీర్ల నియామకంపై తనకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండడం విమర్శల పాలవుతోంది.

400 మంది ఉపాధ్యాయులు కావాలి

● సమాచార హక్కు

కమిషనర్ దడబడలు!

రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ రతన్ అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోరిన సమాచారాన్ని అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. కమిషన్‌కు అందిన దరఖాస్తులను పరిష్కరించేందుకు ఆయన ఇటీవల నెల్లూరు నగరానికి వచ్చారు. సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని ఇవ్వడంలో రెవిన్యూ శాఖ మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించిన కమిషనర్ రతన్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని, అలాగే సమాచారం కోసం దరఖాస్తు చేసే వారిపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమాచార హక్కు చట్టంపై గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమాచారం అందుబాటులో ఉన్నా కొన్ని శాఖల అధికారులు సమాచారం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. కమిషన్‌కు జిల్లా నుంచి అనేక అప్పీళ్లు అందుతున్నాయన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి జరిమానాలు విధించే అధికారం కమిషన్‌కు ఉందని మరోసారి గుర్తు చేశారు. రెండు రోజులపాటు సమీక్ష జరిపిన ఆయన 50 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెప్పారు.



ఫిర్యాదులు సేకరిస్తున్న రతన్.

శిశు గృహలో సవాలక్ష సమస్యలు!

తీర్చకుంటే ఎలా?



శిశు గృహలో సమస్యల తిష్ట

అనాధ పిల్లలకు ఆశ్రయమిచ్చేందుకు ఏర్పాటైన శిశు గృహలో అడుగడుగునా సమస్యలే కన్పిస్తున్నాయి. దర్గామిట్టలో గల ఈ కేంద్రాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 2010, ఆగష్టు 15న దీనిని ఏర్పాటు చేశారు. దీని ఏర్పాటు ఉద్దేశం అనాధ పిల్లలను అక్కున చేర్చుకోవడం. ప్రభుత్వం అట్టహాసంగా దీనిని ప్రారంభించినప్పటికీ తగిన విధంగా నిధులు విడుదల చేయడంలో విఫలం కావడంతో శిశు గృహ ఏర్పాటైన నాటి నుంచి పిల్లల పోషణ ఇతరత్రా అవసరాల కోసం దాతలపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. షుమారు 22 మంది చిన్నారులు శిశు గృహలో ఆశ్రయం పొందగా, వారిలో ఎనిమిది మందిని దత్తత ఇచ్చారు. ఇద్దరు శిశువులు మృతి చెందగా మిగతావారు ఆశ్రయం పొందుతున్నారు. పిల్లలకు పాలు పట్టేందుకు అవసరమైన పాలపొడి కోసం రోజుకు 600 రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మందులు, ఇతరత్రా వాటికి ఖర్చు అదనం. ప్రభుత్వం నుంచి సరిగా నిధులు అందకపోవడంతో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు పిల్లల ఆలనా పాలనా చూడడంలోనూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పిల్లలకు జబ్బు చేస్తే స్టోన్‌హౌస్‌పేటలోని రేబాల వారి చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకొని పోవాల్సి వస్తుండడంతో ఇబ్బందిగా మారుతోంది. అర్ధరాత్రి అపరాత్రి వేళ వైద్యసేవలు అవసరమైతే సిబ్బంది పిల్లలను తీసుకొని పరుగెత్తాల్సి వస్తుండడంతో పరిస్థితి ప్రమాదకరంగా ఉంటోంది. అధికారులు వారానికి ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినా అవి తూతూ మంత్రంగా సాగుతుండడంతో శిశు గృహ చిన్నారులకు తగిన వైద్య సహాయం అందని పరిస్థితి ఎదురౌతోంది. చిన్నపిల్లల వైద్యుడిని ప్రత్యేకంగా నియమించడంతోపాటు పిల్లల పౌష్టికాహారానికి సరిపడా నిధులు మంజూరు చేస్తేనే వారి ఆకలి తీరుతుంది.

బియ్యిడి కాలేజీలో లెక్చరర్లు లేరు!

● భావి ఉపాధ్యాయులకు శిక్షకుల కొరత

నగరంలో ప్రతిష్టాత్మకమైన బియ్యిడి కళాశాలలో అధ్యాపకుల కొరత విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించింది. మంచి ఉపాధ్యాయులను తయారుచేసి అందించాల్సిన ఇక్కడ శిక్షకులు లేని కారణంగా అధ్యాపకులను బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఎదురు కావడం సంస్థ ప్రతిష్టను దిగజారుస్తోంది. సంతపేటలోగల ఈ బియ్యిడి కళాశాలకు ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయి. ఎందరో నిష్ణాతులైన అధ్యాపకులు సమాజానికి ఎందరో టీచర్లను అందించి ఉన్నారు. అలాంటి కళాశాల నేడు అధ్యాపకుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది. సైకాలజీ, ఫిలాసఫీ, రీసెర్చ్ మెథడాలజీ తదితర సబ్జెక్టులను బోధించే అధ్యాపకులు తగినంత మంది లేకపోవడంతో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రొఫెసర్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. బియ్యిడి కోర్సులకు సంబంధించి అధ్యాపకుల కొరత అలాగే ఉంది. కొన్నాళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా అధ్యాపకులను నియమించి విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చూడడంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో బియ్యిడి విద్యార్థులు అరకొర అధ్యాపకులతోనే చదువు కొనసాగించాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఇంగ్లీషు, మ్యాథ్స్, సోషల్, సైన్సు అధ్యాపకుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నా, వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం తగిన శ్రద్ధ కన్పరచకపోవడంతో కొన్నాళ్లుగా బోధనా అధ్యాపకుల కొరతను ఎదుర్కొంటున్నారు విద్యార్థులు. దీనికితోడు వీరు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. విద్యార్థులకు కూర్చొనేందుకు సరైన కుర్చీలు, బల్లలు లేక అవస్థలు పడుతున్నారు. చివరకు గొంతు తడుపుకొనేందుకు అవసరమైన తాగునీటి వసతి విద్యార్థులకు అందని పరిస్థితి ఉందంటే ఎంత ప్రతిష్టాత్మకమైన బియ్యిడి కళాశాల ఎంతటి దుస్థితిలో ఉందో తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మసకబారుతున్న కళాశాల పేరుప్రతిష్టలు తిరిగి నిలబెట్టేందుకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.



సమస్యల వలయంలో నెల్లూరు బియ్యిడి కాలేజి.

పేదల దరిచేరని మెప్మా!

నీరుగారిన పథకం

పట్టణ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, ఏర్పాటుచేసిన వివిధ సంస్థలు అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా నీరుగారి పోతున్నాయి. పేదల కోసం వారికి లబ్ధి చేకూర్చేందుకు నిర్దేశించిన పథకాలు వారి దరి చేరడం లేదు. ఇందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఉదాహరణ. పొదుపు గ్రూపులకు వివిధ రుణాలను ఇవ్వాల్సిన సంస్థలో పథకాల అమలు నత్తనడకన సాగుతుండడంతో ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేరకుండా పోతోంది. బ్యాంకు లింకేజి ద్వారా రుణాలు ఇప్పించాల్సి ఉండగా క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం ప్రభావం వాటిపై పడుతోంది. దీంతో లబ్ధిదారులకు మెప్మా ద్వారా అందే వివిధ పథకాలు అందని పరిస్థితి నెలకొంటోంది. ఈ సంవత్సరం పట్టణ ప్రాంతాల్లో పొదుపు గ్రూపులకు బ్యాంకు లింకేజి ద్వారా 70 కోట్ల రూపాయల రుణాలు ఇప్పించాలన్నది లక్ష్యంకాగా ఇప్పటి వరకు 50 శాతం కూడా రుణాల క్రింద ఇవ్వని పరిస్థితి ఎదురౌతోంది. నెల్లూరు, గూడూరు, కావలి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, ప్రాంతాల్లో ఈ కార్యక్రమం సక్రమంగా నిర్వహించలేక పోతున్నారు. మరోవైపు అవినీతి ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. రుణాల విషయంలో కొందరు సిఓ, సిఆర్పీలకు మామూళ్లు చెల్లించుకుంటేనే రుణాలు అందేలా చేస్తున్నారని, లేదంటే కాళ్లరిగేలా తిరిగినా రుణం దక్కదని పొదుపు గ్రూపు సభ్యులు వాపోతున్నారు. ఇక పట్టణ మహిళా స్వయం సహాయక ఉపాధి పథకం మరింత అధ్వాన్నంగా తయారైంది. ఈ పథకం క్రింద స్వయం సహాయక సభ్యులందరూ ఉమ్మడిగా ఉపాధి పథకాన్ని నిర్వహించుకోవచ్చు. షుమారు పది లక్షల వరకు రుణం లభించడంతోపాటు అందులో 35 శాతం సబ్సిడీ అందుతుంది. ఈ పథకం గురించి పొదుపు గ్రూపు సభ్యుల్లో అవగాహన కల్పించడంలో సిబ్బంది విఫలం కావడంతో చాలామందికి ఈ పథకం ఒకటి ఉన్నట్లే తెలియని పరిస్థితి ఉందంటే ఎంత అలసత్వం వహిస్తున్నారో, ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తుంది. అలాగే పావలా వడ్డీ రుణాలు, రాజీవ్ యువ కిరణాలు అమలులోనూ తగిన విధంగా స్పందించకపోవడంతో పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలు వారి దరి చేరని పరిస్థితి ఎదురౌతోంది.

అంతే సంగతులు

మొదటి పేజీ కొరవ

కారం తీసుకోవాలని చూశారు. కానీ ఫలించలేదు. ఎమ్మెల్యేల విషయంలో మాత్రం పరిస్థితి వేరుగా వుంది. ఎల్‌బినగర్ శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, కుతుబుల్లాపూర్ ఎమ్మెల్యే కోన శ్రీశైలం గౌడ్ వంటివారు జగన్‌లో కలిసి పోవడానికి సిద్ధమౌతున్నారు. ఈ కోవకు చెందిన తెలంగాణ ఎమ్మెల్యేల సంఖ్య పదిహేను వరకు వుంటుందని అంచనా.

వైఎస్‌జగన్ ఎక్కువగా టిడిపి నుంచి వలసలను ఆశిస్తున్నాడు. కృష్ణ, గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మీద ప్రత్యేక ఆసక్తి వుంది ఆయనకు. రేపటి ఎన్నికలలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, తూర్పుపశ్చిమ గోదావరి జిల్లాలలో నూటికి తొంభై శాతం సీట్లు తానే గెలుస్తాననే నమ్మకం వుంది ఆయనకు. ఈ అన్ని చోట్లా కలిసి పదిపదిహేను తప్ప తతిమా సీట్లన్నీ తనవే అని భావిస్తున్నాడు. సర్వే నివేదికలు ఆయనలో ఆ నమ్మకాన్ని పెంచుతున్నాయి. అయితే కొన్ని జిల్లాలలో టిడిపి నుంచి తీవ్రమైన పోటీ ఎదురయ్యే ప్రమాదం వుంది కాబట్టి ఆ పార్టీని నైతికంగా, వ్యవస్థాపరంగా కూడా చంపి పోగులు పెట్టాలన్నది పథకం. అందుకోసం తెలుగుదేశం నుంచి ఎక్కువ మందిని ఆకర్షించడానికి చూస్తున్నారు.

తెలుగుదేశాన్ని భ్రష్టు పట్టించడానికి జగన్ ఎంచుకొన్న మరొక మార్గం – అవిశ్వాసంపై ఒత్తిడి. చంద్రబాబు అవిశ్వాసం పెట్టడం లేదని, కాంగ్రెస్‌తో రాజీ పడ్డాడని జనంలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నది జగన్ ఆంతర్యం. నిజానికి ప్రభుత్వాన్ని పడగొట్టాలంటే చంద్రబాబు అవిశ్వాసం పెట్టవలసిన అవసరం లేదు. తాను గవర్నర్ వద్దకు పదిమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పంపి మద్దతు ఉపసంహరణ లేఖలు ఇప్పిస్తే చాలు. కానీ ఏ ఎమ్మెల్యే కూడా టిక్కెట్లు గ్యారంటీ లేకుండా, ప్రభుత్వం తప్పకుండా పతనమౌతుందన్న నమ్మకం కలగకుండా గవర్నర్ వద్దకు వెళ్లే పరిస్థితి కన్పించడం లేదు. దానితో చంద్రబాబు మీద అవిశ్వాసం పెట్టమనే ఒత్తిడి పెంచుతున్నాడు.

చంద్రబాబు నిజంగా అవిశ్వాసం పెట్టడం అంటూ జరిగితే ప్రభుత్వానికి ప్రమాదం తప్పదని పరిశీలకుల అంచనా. గత సంవత్సరం ఇదే ప్రకారం బాబును గత్తర పెట్టి అవిశ్వాసం పెట్టించాడు జగన్. అప్పట్లో కిరణ్‌కు అండగా కెవిపి రామచంద్రరావు వున్నాడు. శాసనసభ లాబీలలో ఎమ్మెల్యేలను గంటల తరబడి కూర్చోబెట్టి, హామీలిచ్చి ప్రభుత్వాన్ని నిలబెట్టారు. అయితే అప్పట్లో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చలేదు కిరణ్‌కుమార్‌రెడ్డి. ఇస్తానన్న డబ్బు కానీ, చేస్తానన్న పనులు కానీ జరగలేదని ఎమ్మెల్యేలు అసంతృప్తిగా వున్నారు. అందువల్ల ఈసారి మళ్లీ అటువంటి హామీలు ఇస్తే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. కెవిపి వంటివారు ముందు కొచ్చి తెరవెనుక మంత్రాంగం నడిపే అవకాశం అసలే లేదు.

ఎన్నికల వాతావరణం దాదాపు ముసురుకొని వుంది కాబట్టి, జగన్‌తో ఒప్పందాలు చేసుకొని అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఎమ్మెల్యేలందరూ అవిశ్వాసం సమయంలో ప్రభుత్వాన్ని దెబ్బ తీసే ప్రమాదం వుందని పరిశీలకుల అంచనా. కేవలం పదిమంది పార్టీ ఫిరాయిస్తే ప్రభుత్వం పడిపోతుంది. అందుకోసమే చంద్రబాబు మీద అంత ఒత్తిడి తెస్తున్నాడు జగన్. పదే పదే అవిశ్వాసం పెట్టడం లేదని నిందిస్తున్నాడు. దాని వల్ల జనంలో తెలుగుదేశం భ్రష్టుపట్టి పోవాలన్నది జగన్ కోరిక.

జాతీయవాదిని చేసిన మీడియా

9వ పేజీ కొరవ

పోకడను ప్రవేశ పెట్టడం బాలథాకరే రాజకీయ శైలి. ఇటీవల బొంబాయి నగరంలో పొట్ట కూటి కోసం పని చేసుకొనే బీహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన నిరుపేద కార్మికులపై శివసైనికులు జరిపిన దాడులు అందుకొక ఉదాహరణ. బీహార్ వైపు వెళ్లే రైళ్ల మీద దాడి చేయడమే కాదు, రోడ్డు పక్కన గుడారాలు వేసుకొని నివసించే పేదల మీద కర్కశమైన దౌష్ట్యాన్ని ప్రదర్శించారు శివసైనికులు.

ముంబాయిలో వ్యాపారాలు వలస జీవులవే!

అయితే మహారాష్ట్ర ఆత్మ గౌరవం ప్రేరేపించడానికి బాలథాకరే చేసిన దుర్మార్గపు పనులేవీ బొంబాయిలో మరాఠీ యువతీయువకులకు ఉపయోగపడిన సాదృశ్యం లేదు. బొంబాయి నగరంలో ఈ రోజుకీ వ్యాపారాలన్నీ గుజరాతీ, మార్వాడీ, మద్రాసీ కుటుంబాలవే కావడం గమనార్హం. ఈ వలస జీవుల నుంచి రౌడీ మామూలు రాబట్టుకోవడం కోసం మాత్రమే మరాఠా నినాదం లేవనెత్తాడే తప్ప నిజంగా మరాఠా ప్రజలకు ఉపాధి కల్పించాలన్న ఆలోచన శివసేనలో అణుమాత్రం లేదన్నది కళ్లకెదురుగా కనపడే వాస్తవం.

భారతీయ ప్రజాస్వామ్యమనే చెట్టుకు కాసిన కుక్కమూతి పిందె వంటివాడు బాలథాకరే. కానీ బొంబాయి నగరవాసులు, ఇంగ్లీషు ప్రసార సాధనాలు కలిసి మరణం తర్వాత ఆయన్నొక మహాత్ముడిగా మలచారు. ఆ ఉన్మాదానికి లోబడిన ప్రభుత్వం కూడా బాలథాకరేకు జాతీయ నేత హోదాలో అధికార లాంఛనాలు, మువ్వన్నెల జెండా, పోలీసు తుపాకీ వందనంతో అంతిమ వీడ్కోలు పలికింది. ప్రజాస్వామ్యాన్ని ఏ కోశానా విశ్వసించని వాడి ముందు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మోకరిల్లడం కంటే భావదారిద్ర్యం వేరొకటి వుండదు.

ముస్లింను పెళ్లాడిన మనుమరాలు

ఇక్కడొక అందరూ గమనించవలసిన విశేషం ఒకటి వుంది. జీవితకాలం ముస్లిం మతస్తులను ద్వేషించిన థాకరేకు చివరి క్షణం వరకు ప్రాణదానం చేసిన వైద్యుడు ఒక ముస్లిం కావడమే ఆ విశేషం. ఆయన మనుమరాలు ఒక గుజరాతీ ముస్లింను ప్రేమించి పెళ్లాడడం మరొక విశేషం. ఏ గుజరాతీలను, ముస్లింలను, ప్రేమికుల రోజును బాలథాకరే జీవితకాలం ద్వేషించాడో ఆ మూడు అంశాలనూ ఆయన ఇంట్లో ప్రవేశపెట్టడం ద్వారా గొప్ప సంకేతం ఇచ్చింది విధి వ్రాత.

బండ్‌తో భార్య ప్రాణం తీశాడు

విధి విచిత్రానికి ఆయన జీవితంలోని మరొక విషాద ఉదాహరణ ఆయన భార్య మరణం. ఆమెకు తీవ్రమైన ఉబ్బసం వ్యాధి వుంది. అవసరం వచ్చినప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రత్యేకమైన మందులు వాడకుంటే గుండెపోటు వచ్చే ప్రమాదం వుందని డాక్టర్లు చెప్పారట. బాలథాకరే కన్నెర్ర చేస్తే బొంబాయి నగరంలో కాకి కూడా ఎగరదని ప్రతీతి. ఆ నియంత్రణను చాటుకోవడానికి ఏదో ఒక కారణమంటూ తరచూ బండ్‌లు జరిపించడం ఆయనకలవాటు. ఒకరోజు అటువంటి బండ్ జరుగుతున్న సమయంలోనే ఆమెకు ఆ మందుల అవసరం ఏర్పడిందట. బయట చూస్తే బండ్ వల్ల ఒక మందుల అంగడీ లేదు. తన స్నేహితులు చాలా మందికి ఫోన్ చేసి చెప్పాడట. కానీ వారు వెతికి తెచ్చేలోగానే ఆమె బాలథాకరే చేతులలోనే ప్రాణం కోల్పోయింది. థాకరే జరిపించిన బండ్‌ల వల్ల కొన్ని లక్షల మంది బొంబాయి నగరవాసులు తమ జీవితాలలోఇటువంటి విషాదాలు ఎన్నింటినో ఎదుర్కొన్నారు. చివరకు ఆ చేదు అనుభవాన్ని స్వయంగా ఆయనకే రుచి చూపించాడు భగవంతుడు.

జనవాణి

2వ పేజీ కొరవ

ణాల్లో నడివీధుల్లో అవి సృష్టించే నానారకాల భీభత్సం – వృద్ధులు, పిల్లలు వాటి బారినపడి, గాయపడి, ఆస్పత్రుల పాలుకావడం ప్రత్యక్షంగా అనుభవిస్తేగాని తెలీదు. భూత దయకు పరిమితి వుంటుంది. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛగా జీవించే హక్కుకు భంగం కలిగించే శునకాలు, వరాహాలు, మర్కటాలను నిస్సందేహంగా నిర్మూలించాల్సిందే.

షేక్ మైమూన్ నెల్లూరు

మంచి పరిణామం

బ్రిటన్‌కు చెందిన హాంగ్‌కాంగ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ – హెచ్‌ఎస్‌బిసిలకు సంబంధించిన స్విట్జర్లాండ్ శాఖలలో డబ్బు దాచిన ఏడు వందల మంది భారతీయుల గూర్చి ప్రభుత్వం ఇప్పుడు దర్యాప్తు జరిపిస్తోంది. ప్రభుత్వం ఈ దర్యాప్తుకు పూనుకోవడానికి కారణం అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని అవినీతి వ్యతిరేక భారత్ – ఇఏసి – ఉద్యమం వారు ఈవారంలో బట్టబయలు చేసిన లెక్కలే కారణం. కేజ్రీవాల్ బృందం ఈ జాబితా వెల్లడి చేయకుండా వుంటే ప్రభుత్వం ఈ దర్యాప్తుకు పూనుకొని వుండేది కాదు. విదేశీ బ్యాంకులలో భారతీయులు దాచిన నల్లడబ్బు విలువ దాదాపు 23 లక్షల కోట్ల రూపాయలని ఓ అంతర్జాతీయ సంస్థ ఆధారాలతో సహా నిర్ధారించింది. కాని ఈ వ్యవహారమై ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. ఈ డబ్బంతా భారతదేశం తెస్తే భారతదేశం బీదరికం మటుమాయమవడం ఖాయం.

ఎం.శ్యామ్‌సుందర్ నెల్లూరు

నెల్లూరుముచ్చట్లు


3వ పేజీ కొరవ

నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. చిల్లకూరు మండలానికి చెందిన తెలుగుదేశం నాయకుడు ఎద్దల మధుసూధన్‌రెడ్డి 18వ తేది రాజమోహన్‌రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి రాజమోహన్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కూలడం ఖాయమన్నారు.

అత్యాధునిక బ్రెయిన్ సర్జరీ


వివిధ బ్రెయిన్ సమస్యలతో బాధపడే వారికి అత్యాధునిక సర్జరీలు అందుబాటులోకి వచ్చాయని అపోలో హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ రామనారాయణన్ తెలిపారు. నెల్లూరు ఆర్టీసి బస్టాండ్ వద్ద అపోలో ఇన్ఫర్మేషన్ సెంటర్‌కు వచ్చిన ఆయన డాక్టర్ నరేంద్రరెడ్డితో కలసి చెన్నై అపోలో హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక బ్రెయిన్ సర్జరీల గురించి వివరించారు. డీప్ బ్రెయిన్ స్టిములేషన్ సర్జరీ ద్వారా తక్కువ సమయంలో మంచి ఫలితాలను పార్కిన్‌సన్, ఎఫిలిప్సీ బాధితులు పొందవచ్చన్నారు. అలాగే యూరినరీ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఈ సర్జరీ వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

గండవరపు రాధాకృష్ణారెడ్డి మరణం



జనతాపార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు, 1986లో కోవూరు షుగర్ ఫ్యాక్టరీని ఛైర్మన్‌గా అభివృద్ధిపథంలో నడిపిన ఇనమడుగు రైతు కుటుంబీకుడు, గండవరపు రాధాకృష్ణారెడ్డి (86) 19వ తేది మరణించారు. రాధాకృష్ణారెడ్డి కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గ రాజకీయాలలో కీలకనేతగా ఉండి, నల్లపరెడ్లు, సోమిరెడ్డిల కుటుంబసభ్యులతో దగ్గరగా మెలిగేవారు. ఇనమడుగు పంచాయితీలో 50 ఏళ్లుగా రాధాకృష్ణారెడ్డి అనుచరులే సర్పంచ్‌లుగా కొనసాగారు. ఊర్లో సమాజసేవకు అనూరాధ చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించి ఉచిత మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఊరిలో ఎవరు చనిపోయినా రెండు వేల రూపాయలు దహన సంస్కార ఖర్చులకు ఇచ్చేవారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. రాధాకృష్ణారెడ్డి కుటుంబీకులను నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు.

నయాగర రమణారెడ్డి మరణం



నయాగర పేపర్ ప్రాడక్ట్స్ కంపెనీ నిర్వాహకులలో ఒకడైన కొల్లి వెంకట రమణారెడ్డి 20తేది మరణించాడు. వారి స్వగ్రామం విరువూరు. బెంగుళూరులో స్థిరపడ్డాడు. మాజీ గవర్నర్, కేంద్రమంత్రి డాక్టర్ కెవి.రఘునాథరెడ్డికి సమీప బంధువు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. రమణారెడ్డి కష్టజీవి. శ్రీహరికోటలో సుఖమైన ఉద్యోగాన్ని వదలుకొని వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని జీవితంలో నిలదొక్కుకొన్నాడు. ఎంతటి కష్టంలో కూడా నిబ్బరంగా వుండగలగడం వారి కుటుంబానికే చెల్లిన విశేషం. స్నేహానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చేవాడు. పదిమందితో మంచిగా మెలగాలని తపన పడేవాడు. ఎవరినీ పల్లెత్తుమాట అనేవాడు కాదు. కష్టాలు తీరి ఆర్థికంగా నిలదొక్కుకొనే సమయంలో గుండెపోటు ఆయన ప్రాణం తీసింది. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు.

మరణం

నెల్లూరు విఆర్ కాలేజి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఉమెన్స్ అకాడమీలకు ప్రిన్సిపల్‌గా పని చేసిన కోవూరు వాసి సన్నపరెడ్డి రాఘవరెడ్డి సతీమణి సుచరిత(67) 14వ తేది కోవూరులో మరణించారు. ఆమెకు ఓ కుమారుడు, కుమార్తె.

ఆత్మీయులను కోల్పోయిన పై మూడు కుటుంబాల వారికి మా సానుభూతి.

పదరంగం -43

నిర్వహణ : బాబాజీ

1		2		3		4		5		6
		7								
8	9							10	11	
			12		13		14			
15									16	17
		18		19						
20			21							
		22				23	24		25	
26	27								28	29
30				31	32			33		
34			35				36			

అడ్డం

1. తెల్లవారుజాము (3)
3. ఆటలో బ్రేక్ (5)
7. నీరు (3)
8. ప్రకృతికి వ్యతిరేకం (3)
10. కొంచెం కూడా (3)
12. డబ్బు (3)
14. బాధలు, కష్టాలు (3)
15. ప్రకృతి మృగం, వికృతి? (2)
16. కవితలు వ్రాయువాడు (2)
19. ఒక చర్మ వాయిద్యం (3)
20. ఆరుద్ర తరువాత నక్షత్రం (4)
22. అటునుంచి తోక (3)
23. సమయం (2)
26. మాయ, మరోవిధంగా (2)
28. అటునుంచి ప్రతిమ (2)
30. ఆలోచన (3)
31. బేలుదారి పని ముట్టు (2)
33. పరాజయం (3)
34. అటునుంచి పట్టణం (2)
35. మూషికం (3)
36. అటునుంచి కరుణానిధి కూతురు పేరు తడబడింది (4)

నిలువు

1. ఎండాకాలం (3)
2. సౌకర్యం (3)
3. తోడు, ఆధారం (4)
4. విశ్రాంతి (3)
5. ఆనందం (4)
6. ఆపద (3)
9. ఆర్టిఫిషియల్ (3)
11. తెలుగు పారెట్ (3)
12. నేల, విలువ (2)
13. హిందీలో ఎదుర్కోవడం (4)
14. ప్రతిఫలం లేని చాకిరి (2)
15. లైట్నింగ్ (3)
17. క్రింద నుంచి కాననం (3)
18. పండుగ (3)
21. కష్టం కాదు (3)
24. నీటి మధ్య ప్రదేశం (2)
25. దీపాల నుంచే గుండ్రని గూడు (4)
26. తల్లి వందే... (3)
27. ప్రేమ (3)
29. ఎముక (3)
31. గింజలేని విత్తనాలు (2)
32. క్రింద నుంచి వానరుడు, కోతి (2)
33. పాతకాలపు కన్యా శుల్కం (2)

సమాధానాలు

పదరంగం -42

1ఆ	2వి	ర్భా	3వం		4గ	జ	గా	5మి	6ని	
7లం	క		8ద	క్షి	ణం			9డ	ప్పు	10లు
11బ	లం		నం				12పీ	త		ప
న		13వం					ను		14గా	పా
	15లో	చ	నం		16గా	17ను	గ	18పిం	డి	
19ల	ల	న		20ఫ		ల		21గ	ద	లు
22శా	కం		23వా	ణి		24క	25లు	ళ		
		26ఉ	క్కు			27ఘం	కా			28తే
29చా	క	లి		30టి		చం		31వా	32రి	జం
మీ			33ము	మ	34నా		35వే	లు	పు	
36రం	గో	ళి		37కో	రి	క	లు		38లు	చే

సంక్షిప్త సింహపురి

విద్యుత్ ఎస్ఇ కార్యాలయానికి నిరంతరం కరెంట్!

నగరంలో చలి ప్రారంభమయ్యి విద్యుత్ వినియోగం తగ్గినా కోతలో మార్పు లేదు. రైతులకు రోజుకు నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ సరిగ్గాలేకపోవడంతో త్రాగు నీటి పథకాల పరిస్థితి దీనంగా తయారయ్యింది. కలెక్టర్, ఎస్పీ బంగళాలతో పాటు కలక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి విద్యుత్ కోతల సమయంలో విద్యుత్‌ను సరఫరా చేయని ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వరకు దిగుల్లేకుండా చూసుకుంది. విద్యుత్ శాఖకు తామే అధిపతుల మన్న అహంకారంతో ఎస్ఇ కార్యాలయ ఆవరణలో ఉన్న సబ్ స్టేషన్ నుంచి 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా వెసలుబాటు కల్పించుకొన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయం సోంబేరులకు చిరునామా. వారికి మాత్రం 24 గంటలు కరెంట్ కావాలి. జనం, ఇతర ప్రభుత్వ శాఖలు మాత్రం కోతల వాతలు భరించాలి. ఇదేమి న్యాయం నందకుమార్ గారు!

ఎల్ఎల్ఎఫ్ స్కూల్‌లో బాలల దినోత్సవం!



నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నవంబర్ 14వ తేది బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్ షో నిర్వహించారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ ఇ.కృష్ణచైతన్య కేక్ కట్‌చేసి పిల్లలకు పంచి పెట్టారు. అనంతరం చాచా నెహ్రూ జీవిత విశేషాలను పిల్లలకు వివరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌లోని విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లి తండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌లో జాలి గుణం

జిల్లా కలెక్టర్‌లో జాలి గుణం మెండుగా ఉండాలి. ఇబ్బందులలో తన వద్దకు వచ్చే వారిని తనకున్న అపరిమిత అధికారాలతో ఆదుకోవాలి. కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి బయటకు గట్టి వ్యక్తిలా కనపడతారు. కానీ ఈ వారం ప్రజా విజ్ఞప్తుల దినానికి సాయం కోసం కలక్టరేట్‌కు వచ్చిన తోటపల్లి గూడూరు మండలం కోవెలపాళెం బాలిక ప్రియదర్శిని పడుతున్న వ్యధ విని కలెక్టర్ చలించి పోయారు. కంట తడిపెట్టారు. వెంటనే ఈ పదేళ్ల బాలికకు నెలనెలా ఐదు వందల రూపాయలు పింఛన్ మంజూరు చేశారు. బాలిక ఆశ్రయం పొందుతున్న ఆమె తాతయ్య కుటుంబానికి అన్నయోజన పథకం ద్వారా ప్రతి మాసం 35 కిలోల బియ్యం పొందేలా ఉత్తర్వులిచ్చారు. ఈ బాలిక తల్లితండ్రులు హెచ్ఐవి సోకి చనిపోయారు. వీరి నుంచి హెచ్ఐవి ఈ బాలికకు సోకి ప్రస్తుతం రెండు కళ్లు పోయాయి. ఆపరేషన్‌కు వీలులేదని బతికే వరకు సాయం చేయమని ఈ బాలిక కలెక్టర్‌ను కోరగా ఆయన హృదయం ద్రవించి పోయింది. వ్యక్తిగతంగా కూడా ప్రియదర్శినికి అండగా ఉంటానని ధైర్యంగా ఉండమని కలెక్టర్ భరోసా ఇవ్వడంతో ఆ బాలిక మోములో నవ్వు కనిపించింది.


వియానీ హోమ్‌కు విరాళం!



నెల్లూరు పొదల కూరురోడ్డులోని వియానీ హోమ్‌కు డాక్టర్ కిషోర్ రత్నం జెన్‌నెక్ట్ స్కూల్ అధినేతలు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతిలు 39వేల రూపాయలు విరాళాన్ని ఇటీవల అందించారు. స్కూల్ పిల్లల కోసం ఇటీవల యాజమాన్యం కార్నివాల్ కార్యక్రమం అనిల్ గార్డెన్స్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టు ద్వారా ఈ 39వేల రూపాయలు సమకూరాయి. ఈ మొత్తం ఓ మంచి కార్యక్రమానికి అందివ్వాలన్న ఆలోచనలో వికలాంగులకు వెన్నుదన్నుగా నిలిచే వియానీ హోంకు ఈ మొత్తాన్ని అందించడం సంతోషంగా ఉందని డాక్టర్ కృష్ణకిషోర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు కూడా పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు 475 రూపాయలా?

సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచాలని, హాస్టళ్లకు సరఫరా చేసే గ్యాస్‌పై సబ్సిడీ ఇవ్వాలని కోరుతూ బిసి విద్యార్థి సంఘం కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నడుస్తూ నిరసన వ్యక్తం చేసింది. కళాశాల విద్యార్థులకు నెలకు మెస్ ఛార్జీలుగా 520 రూపాయలు, పాఠశాల విద్యార్థులకు 475 రూపాయలు ఇస్తున్నారని, ఈ లెక్కన ఒక్కపూట భోజనానికి ఐదు రూపాయలు మంజూరు చేసినట్లని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు 900, కళాశాల విద్యార్థులకు 1500 రూపాయలు మెస్ ఛార్జీలుగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సబ్సిడీని ఎత్తి వేయడం వల్ల హాస్టళ్లలో పిల్లలకు గుడ్డు, సాయంత్రం పూట స్నాక్స్ ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ధర్నాకు లీలామోహన్, కిరణ్, మురళి, భాస్కర్, నరేష్, చరణ్, సుమన్ గౌడ్ నాయకత్వం వహించారు.



రైతు లోకం

వరిలో సక్రమ నీటి యాజమాన్యం!

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, అడుగంటుతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకొని వరిపైరుకు అవసరం మేరకే నీరు వాడుతూ సక్రమ నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు.

వరిపైరులో నీటికి అత్యంత సున్నితమైన దశలు: అంకుర ప్రారంభ దశ, చిరుపొట్ట, పూత మరియు పాలుపోసుకొనే దశలు.

వరిలో నీటి యాజమాన్యం

నాట్లు సమయం: పొలం ఎత్తు పల్లాలు లేకుండా చక్కగా చదునుచేసి పలుచని నీటి పొర వుంచి (2 సెం.మీ) నాట్లు వేయాలి. అలా చేయడం వల్ల మొక్కలను సరైన లోతులో నాటడానికి వీలై ప్రతి మొక్క ఎక్కువ పిలకలు వేస్తుంది.

నాట్లువేసిన తర్వాత 5 రోజుల వరకు: మొదటి 5రోజులు 5 సెం.మీ లోతున నీరు వుంచాలి. దీనివల్ల మొక్కలు నిలదొక్కుకొని, వేర్లు భూమిలో స్థిరపడి త్వరగా మూనతిరుగుతుంది.

పిలకలు వేయు దశ: ఈ దశ ప్రారంభం నుండి చిరుపొట్ట దశ వరకు 2 సెం.మీ నీరుం చాలి. దీనివల్ల పిలకల సంఖ్య పెరిగి వేర్లు చురుకుగా లోతుగా పెరుగుతాయి.

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

చిరుపొట్ట, పూత, పాలు పోసుకునే దశలు: ప్రత్యుత్పత్తి దశ కాబట్టి ఈ దశలలో వరిపంటకు నీటి అవసరం పెరుగుతుంది. కావున ఈ దశలు పూర్తయ్యేవరకు 5 సెం.మీ నీరుంచాలి. ఈ దశల్లో పైరు నీటి ఎద్దడికి గురైతే 50శాతం వరకు కూడా దిగుబడి తగ్గే అవకాశం వుంది. కోతకు 10 రోజుల ముందుగా పొలం నుండి నీరు తీసెయ్యాలి.

నీటియాజమాన్యానికి సూచనలు

నత్రజని ఎరువు వేసేటప్పుడు నీరు తీసివేసి బురద పదునుపై వేయాలి. క్రిమి సంహారక గుళికలు, కలుపు మందులు వేసేటప్పుడు పొలంలో 2 అంగుళాలు నీరుండేటట్లు చూసుకోవాలి. ఆ నీరు భూమిలో పూర్తిగా ఇంకిన తరువాతే మరలా నీరు పెట్టాలి. నీటి కొరత సంభవించినప్పుడు అనియమిత నీటితడులు అంటే పొలానికి 5 సెం.మీ నీరుపెట్టి ఆ నీరు ఇంకిన తరువాతే మళ్లీ నీరుపెట్టినట్లయితే నీరు ఆదా అవుతుంది. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు వున్నప్పుడు నీటి మట్టాన్ని పెంచాలి. పొలంలో ఎప్పుడూ 5 సెం.మీకి మించి నీరుండరాదు. దోమపోటు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో పిలకలు వేసే దశలో చేనుని అడపాదడపా ఆరగట్టాలి. అగ్గితెగులు ఆశించిన పొలంలో నీరు తీయరాదు. రెల్లరాల్చు పురుగు ఆశించినప్పుడు నీరు ఎక్కువగా పెట్టాలి.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

కొమ్మికి జగన్ గ్రీన్‌సిగ్నల్‌తో ...

మేకపాటి సోదరుల్లో తీవ్ర అసంతృప్తి!

- **టిక్కెట్ల నిర్ణయంలో తన ఆలోచన ఎట్లా ఉంటుందో కొమ్మి ఎంపికతో చాటిచెప్పిన జగన్.**
- **వెంకటగిరి నుంచి విజయసాయిరెడ్డి పోటీ చేస్తాడని ప్రకటించి యూటర్న్.**
- **రెడ్ల పార్టీ కాదన్న నిరూపణకు లక్ష్మయ్యకు అవకాశం.**

పార్టీ నిర్వహణలో తన శైలి ఎట్లా వుండ బోతుందో నెల్లూరుజిల్లా నేతలకు రుచి చూపించాడు వైఎస్‌జగన్. జిల్లాలోని అధిక భాగం శాసనసభ స్థానాలకు ఆయన ఆరేడు నెలల క్రితమే అభ్యర్థులను నిర్ణయించాడు. నెల్లూరు నగరానికి అనిల్‌కుమార్ యాదవ్, సర్వేపల్లికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరికి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరుకు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కావలికి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సూళ్లూరుపేటకు నెలవల సుబ్రహ్మణ్యం, కోవూరుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్లు అధికారికంగా ప్రకటించాడు. నెల్లూరు రూరల్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేరు కూడా మొదట చెప్పాడు కానీ, మేకపాటి సోదరుల అభ్యంతరాల తర్వాత కొంతకాలం ఆగమని సూచించాడు. వెంకటగిరి విజయసాయి రెడ్డికి కేటాయిస్తున్నట్లు చెప్పాడు. గూడూరు విషయంలో మాత్రం ఎవరి పేరూ చెప్పలేదు. దానితో ఆయా నియోజకవర్గంలో అభ్యర్థులందరూ ఓట్ల వేటలో నిమగ్నమైపోయి వున్నారు.

ఈ నిర్ణయాలలో జగన్ ఒకరితో సంప్రదించినట్లు కానీ, సలహా పడినట్లు కానీ కన్పించదు. తన స్వంత వనరుల ద్వారా సేకరించిన సమాచారం, జరిపించిన సర్వేనివేదికల ఆధారంగా జగన్ నిర్ణయాలు తీసుకొన్నాడు. అయితే ఇటీవల కొంతకాలంగా ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జిల్లా రాజకీయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాడు. జిల్లా వరకు పార్టీని తానే నడిపించాలన్న కోరిక ఆయనలో అంతర్లీనంగా వుందన్నది వాస్తవం. అందువల్లనే అలవాటుకు భిన్నంగా ఎక్కువకాలం నెల్లూరులో గడుపుతున్నాడు. చిన్నపాటి రాజప్రసాదమంత ఇల్లు కూడా కట్టిస్తున్నాడు. రేపటి ఎన్నికలలో జిల్లా వరకు తన అభిప్రాయాలకు అనుగుణంగా టిక్కెట్ల పంపకం జరగాలన్నది ఆయన అభిమతం. ఆ దృష్టితోనే చాలా మంది ఆశావహులను ప్రోత్సహిస్తున్నారాయన. నెల్లూరు రూరల్‌లో ఆనం వెంకటరమణారెడ్డి పూర్తిగా రాజమోహన్‌రెడ్డి భరోసాతోనే వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో కొనసాగుతున్నాడు. ఆత్మకూరులో కొమ్మి లక్ష్మయ్యనాయుడు పట్ల కూడా మేకపాటి సోదరులకు అభ్యంతరాలున్నాయి. కొమ్మిని టిక్కెట్ల వేట నుంచి పక్కకు తప్పించడానికి ఆత్మకూరులో తన సోదరుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేయాలనే ప్రతిపాదన జగన్ ముందు పెట్టారు. జిల్లాలో మరెక్కడా ఖాళీ లేదు కాబట్టి కొమ్మి బెడద తొలగిపోతుందని భావించారు వారు.

అయితే అటు మేకపాటి సోదరుల కోరిక కాదనకుండా, ఇటు కొమ్మిని వదలుకోకుండా, ఆత్మకూరులో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరిలో కొమ్మి లక్ష్మయ్యనాయుడు అభ్యర్థులుగా పని చేసుకోవాలని, విజయసాయిరెడ్డికి రాజ్యసభ వంటి ఇతర అవకాశం ఇస్తానని చంచల్‌గూడ జైలు నుంచి సందేశం పంపాడట జగన్. ఈ నిర్ణయం మేకపాటి సోదరులకు తీవ్రమైన అసంతృప్తి కల్గించింది. జిల్లాలో ఒక కమ్మ వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వకుంటే తన పార్టీ రెడ్లకే పరిమితమన్న దుష్ప్రచారం జరుగుతుందన్నది జగన్ భయం. ఆ ఆలోచనతోనే ఉభయ తారకంగా ఈ మార్పులు సూచించారాయన.

దీనివల్ల ఉదయగిరిలో ఖాళీ ఏర్పడుతున్నది. రాజమోహన్‌రెడ్డి ఎమ్పీగా, శేఖర్‌రెడ్డి ఆత్మకూరు అభ్యర్థిగా కొనసాగుతారు కాబట్టి ఉదయగిరిలో మరొక అభ్యర్థికి అవకాశం లభిస్తుంది. ఉదయగిరిని వదలుకోవడం మేకపాటి సోదరులకు సుతరామూ ఇష్టం లేదు. అది తమ కుటుంబంలోనే వుండాలన్నది వారి అభిలాష. కొమ్మి కోసం ఆత్మకూరు మీద మోజున్నట్లు నటిస్తే, అసలుకే మోసం వస్తున్నదని బాధపడుతున్నారు వారు.

ఇక్కడ రెండు విశేషాలున్నాయి. మొదటిది – విజయసాయిరెడ్డికి టిక్కెట్ నిరాకరించడం. ఆరేడు నెలల క్రితం దీనిపై చర్చ జరిగినప్పుడు విజయసాయిరెడ్డి పట్ల చాలా పట్టుదల చూపాడు జగన్. ఆయన మీద కేసులున్నాయి కదా అని ప్రస్తావిస్తే, విజయసాయిది, నాదీ ఒకటే రకమైన విధి వ్రాత. నాకేమి జరిగితే ఆయనకూ అదే జరుగుతుంది అని ఖండితంగా చెప్పాడు. అంత పట్టుదలను వదలుకొని, వెంకటగిరి నుంచి విజయసాయిని తప్పించాడంటే, రేపటి ఎన్నికలలో పోటీ చేయడానికి కేసులు అడ్డంకి అవుతాయన్న భయం జగన్‌లో కల్గుతుందేమో అన్పిస్తున్నది.

రెండవ విశేషం – టిక్కెట్ల నిర్ణయంలో తన ఆలోచన తప్ప ఇతరులతో సమాలోచన అనేది వుండబోదనే సూచన. ఈ సూత్రం రాష్ట్రం మొత్తానికీ వర్తిస్తుంది. జగన్ పార్టీలో ఆయనొక్కడే నాయకుడు. ఆయన ఆలోచనే పార్టీ విధానం. పక్క చూపులనేవి వుండవని అందరికీ సంకేతం ఇచ్చాడన్న మాట. జగన్ పార్టీ తీరు ఏ రకంగా వుండబోతుందో అర్థం చేసుకోవడానికి ఇదొక నమూనా.

Imported & Indian Furniture
మా ప్రత్యేకత
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
ఆదివారం కూడా షాపు తెరవబడును.

You are cordially invited for the Opening New Gents Showroom
M1 MODERN ERA
Suitings, Shirtings & Readymades
Address : 23-4-76, Kings Court Avenue, Magunta Layout, Nellore.
Cell : 8500000003, Phone : 0861-2310003
Grand Opening on
24th November, 2012
at 10.35 a.m
Showroom Opening by
Sri Anam Ramanarayana Reddy Garu
Honourble Minister For Finance, A.P
First Floor Opening by
Sri Anam Vivekananda Reddy Garu
MLA, Nellore Rural
Second Floor Opening by
Sri Mungamuru Sridhar Krishna Reddy Garu
MLA, Nellore City
Jyothi Prajwalana by
Smt Nandimandalam Bhanusri Garu
Ex - Mayor, Municipal Corporation, Nellore
Kindly Attend And Grace the Occasion
D.Sameer

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com